


# విజయభాను


44th వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, గురువారం 22-04-2021 | VIJAYABHANU DAILY * VISAKHAPATNAM | సంపుటి : 44 సంచిక : 189 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## నాసిక్ ఘటన
# కలచివేసింది

**ప్రధాని నరేంద్రమోదీ**

**రూ.5లక్షల పరిహారం ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం**



దిల్లీ: మహారాష్ట్రలోని ఆస్పత్రిలో ఆక్సిజన్ లీకవ్వడంతో 22 మంది మృతి చెందడంపై ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఆవేదన వ్యక్తంచేశారు.ఈ ఘటన తనను కలచివేసిందని ప్రధాని అన్నారు. ప్రాణాలు కోల్పోయినవారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు ట్విటర్‌లో పోస్టు చేశారు. ఆక్సిజన్ లీకేజీ ఘటనపై హోం మంత్రి విచారం వ్యక్తం చేశారు. " ఆక్సిజన్ లీకేజీ వార్త విని చాలా బాధపడ్డాను. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" అంటూ ట్వీట్ చేశారు. నాసిక్‌లోని జాకీర్ హుస్సేన్ మున్సిపల్ ఆస్పత్రి బయట ఆక్సిజన్ లీకవ్వడంతో రోగులకు ప్రాణవాయువు సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది కరోనా బాధితులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై మహారాష్ట్ర ప్రభుత్వం దర్యాప్తునకు

తరువాయి 2లో..

## భద్రాద్రిలో వైభవంగా
# శ్రీ సీతారాముల కల్యాణం



భద్రాచలం : భద్రాచల క్షేత్రంలో శ్రీ సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. అభిజిత్ లగ్నంలో సీతారాముల కల్యాణ వేడుక కమనీయంగా సాగింది. సరిగ్గా పన్నెండు గంటలకు జిలకర్ర, బెల్లం పెట్టారు. అనంతరం మాంగళ్యధారణ జరిగింది. ఈ కమనీయ వేడుక రామ భక్తుల్ని ఆనంద పారవశ్యంలో ముంచెత్తింది. రాములోరి కల్యాణానికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్ దంపతులు సమర్పించారు.

కరోనా మహమ్మారి వల్ల భక్తజనుల సందడి లేకుండానే కల్యాణ వేడుకలను నిర్వహించారు. ఇవాళ కల్యాణం ముగియడంతో రేపు శ్రీరామచంద్రుడి పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమం జరగనుంది. కొవిడ్ కారణంగా పూజలు, తీర్థ ప్రసాదాలు నిలిపివేశారు.

ఈ వేడుకల్లో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య దంపతులు, జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, ఎస్పీ సునీల్ దత్, జేసీ కర్నాటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్సీ బాలసాని, ఎండోమెంట్ కమీషనర్ అనీల్ కుమార్ దంపతులు, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ తెల్లం వెంకట్రావు, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మతో పాటు పలువురు పాల్గొన్నారు.

## హనుమంతుడి జన్మస్థలం
# అంజనాద్రే

**అధికారికంగా ప్రకటించిన తితిదే**



తిరుమల: హనుమంతుడి జన్మస్థానంపై తితిదే అధికారిక ప్రకటన చేసింది. సప్తగిరుల్లోని అంజనాద్రే ఆంజనేయుడి జన్మస్థానమని తెలిపింది. అంజనాద్రిలోని జాపాలీ తీర్థంలో హనుమంతుడు జన్మించినట్లు వెల్లడించింది. ఈ మేరకు తిరుమలలోని నాదనీరాజనం వేదికగా జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ ఆచార్య మురళీధర శర్మ ప్రకటించారు. ఆంజనేయుడి జన్మస్థానంపై అన్వేషణకు తితిదే కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీలోని పండితులు పలుమార్లు సమావేశమై లోతుగా పరిశోధన చేసి హనుమంతుడు అంజనాద్రిలోనే జన్మించాడని రుజువు చేసేందుకు బలమైన ఆధారాలను సేకరించారు. హనుమ జన్మస్థలంపై నాలుగు నెలల పాటు తమ కమిటీ అన్వేషణ కొనసాగిందని ఆచార్య మురళీధర శర్మ చెప్పారు. అన్వేషణకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. "హనుమ జన్మస్థానంపై సంకల్పం తీసుకున్నాం. శాసన, భౌగోళిక, పౌరాణిక, వాఙ్మయ ప్రమాణాలతో ఆధారాలు సేకరించాం. వేంకటాచల మహత్యాన్ని పౌరాణిక ఆధారంగా తీసుకున్నాం. వేంకటాచలానికి అంజనాద్రితో పాటు 20 పేర్లు

తరువాయి 2లో..

## ఆక్సిజన్ కొరతపై
# ఏపీ ప్రభుత్వం దృష్టి

అమరావతి: కరోనా సెకండ్ వేవ్‌లో కేసులు భారీగా నమోదవుతున్నాయి. పలు రాష్ట్రాల్లో ఆక్సిజన్‌కు తీవ్ర కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో తలెత్తిన సమస్యలు దృష్టి పెట్టుకున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆక్సిజన్ కొరతపై ప్రత్యేక దృష్టి పెట్టింది. భవిష్యత్తులో రాష్ట్రానికి అవసరమైన ఆక్సిజన్‌పై కసరత్తు చేస్తుంది. కోవిడ్ పీక్ స్టేజ్‌లో 200 టన్నుల ఆక్సిజన్ అవసరమవుతుందని అధికారులు అంచనా వేశారు. మిగతా సమయంలో రోజుకు 80 నుంచి 100 టన్నుల ఆక్సిజన్ అవసరమని తెలిపారు. ఏపీకి నాలుగు ప్రాంతాల నుంచి ఆక్సిజన్ తెచ్చుకునేలా ప్రణాళికలు రచించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్, భువనేశ్వర్, బళ్లారి, చెన్నై నుంచి ఆక్సిజన్ వచ్చేలా యాక్షన్ ప్లాన్ రూపిందించారు. విశాఖ స్టీల్ ఇప్పటికే ఆక్సిజన్ సరఫరా ప్రారంభించగా.. బళ్లారి, చెన్నైల నుంచి మరింత ఆక్సిజన్ తెచ్చుకునేలా కసరత్తు చేస్తున్నారు. ఆక్సిజన్ నిల్వలు సిద్ధం చేసుకునేలా ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేశామని అధికారులు తెలిపారు.

## కరోనా బారిన
# మరో కేంద్ర మంత్రి

**- దేశంలో రికార్డు స్థాయిలో నమోదవుతున్న కేసులు**

**- అంతకంతకూ పెరుగుతున్న మృతుల సంఖ్య**

**- కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్‌కు కరోనా**



న్యూఢిల్లీ: దేశంలో రెండో దశలో వేగంగా వ్యాప్తిస్తూ ప్రకంపనలు రేపుతున్న కరోనా వైరస్ మహమ్మారి రాజకీయ ప్రముఖుల్లో కలకలం రేపుతోంది. కోవిడ్-19 పాజిటివ్ నిర్ధారణ అవుతున్న రాజకీయ నేతల జాబితా అంతకంతకే పెరుగుతోంది. తాజాగా కేంద్ర విద్యాశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ నిషాంక్ కరోనా బారినపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ట్విటర్ ద్వారా వెల్లడించారు. కరోనా నిర్ధారణ పరీక్షల్లో తనకు పాజిటివ్‌గా తేలిందని తెలిపారు. వైద్యులు సూచనలమేరకు తాను చికిత్స తీసుకుంటానన్నారు. అలాగే

తరువాయి 2లో..

# ఏపీలో 9,716 కేసులు.. 38 మరణాలు

**- 7,500 దాటిన కరోనా మరణాలు**

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కరోనా విజృంభణ కొనసాగుతోంది. వైరస్ బారినపడుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. అంతేకాకుండా ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతోంది. గడిచిన 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా 39,619 పరీక్షలు నిర్వహించగా.. 9,716 కేసులు నిర్ధారణ కాగా.. 38 మంది ప్రాణాలు కోల్పోయారు. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు రాష్ట్రంలో 9,86,703 మంది వైరస్ బారినపడినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. కృష్ణా జిల్లాలో అత్యధికంగా పది మంది ప్రాణాలు కోల్పోయారు. నెల్లూరులో ఏడుగురు, తూర్పు గోదావరి, శ్రీకాకుళంలో నలుగురు చొప్పునబీ చిత్తూరు, ప్రకాశంలో ముగ్గురేసిబీ గుంటూరు, కర్నూలు, విశాఖ జిల్లాల్లో ఇద్దరు చొప్పునబీ అనంతపురంలో ఒక్కరు కరోనాతో చనిపోయారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మృతుల సంఖ్య 7,510కి చేరింది. 24 గంటల వ్యవధిలో 3,359 మంది బాధితులు

తరువాయి 2లో..

# కోవిడ్ వ్యాక్సిన్ రెండవ డోసు తీసుకోవలసిన వారి కోసం ప్రత్యేక డ్రైవ్

**జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్**



విశాఖపట్నం : కోవిడ్ వ్యాక్సిన్ రెండవ డోసు తీసుకోవలసిన వ్యక్తుల కోసం రేపు అనగా గురువారం జిల్లా అంతటా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టరు వి.వినయ్ చంద్ తెలిపారు. బుధవారం నాడు ఆయన స్థానిక కలెక్టరేట్ లో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కోవిడ్ వ్యాక్సిన్ రెండవ డోసు తీసుకోవలసిన వ్యక్తులు 39,111 మంది వున్నారని తెలిపారు. వీరిలో కోవీ షీల్డ్ రెండవ డోసు తీసుకోవలసిన వారు 32,352 మంది వున్నారని తెలిపారు. కో వ్యాక్సిన్ రెండవ డోసు తీసుకోవలసిన వారు 6,759 మంది వున్నారని తెలిపారు. కోవీ షీల్డ్ వ్యాక్సిన్ మొదటి డోసు తీసుకున్న 6 నుంచి 8 వారాల మధ్య రెండవ డోసు తీసుకోవలసి వుంటుందన్నారు. కో వ్యాక్సిన్ మొదటి డోసు తీసుకున్న 4 వారాల తరువాత రెండవ డోసు తీసుకోవలసి వుంటుందన్నారు. అందువలన రేపు ఉదయం 7.30 నుంచి రెండవ డోసు వేయడానికి ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.


కాబట్టి మొదటి డోసు వేసుకొని నిర్ణీత సమయం పూర్తి అయిన వ్యక్తులు గురువారం నాడు అదే వ్యాక్సిన్ రెండవ డోసు జిల్లాలో ఎక్కడైనా వేసుకోవచ్చునని వివరించారు. మొదటి డోసు ఏ వ్యాక్సిన్ వేసుకుంటే, రెండవ డోసు కూడా అదే వ్యాక్సిన్ వేసుకోవాలని, ప్రజలందరూ ఇది గమనించాలని తెలిపారు. కోవీ షీల్డ్ వ్యాక్సిన్ నగరంలోని కె.జి.హెచ్., ఛాతీ ఆసుపత్రి, మానసిక వైద్య శాల, ఘోషా ఆసుపత్రి, జి.వి.యం.సి. పరిధిలోని 72 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, నర్సీపట్నం మున్సిపాలిటిలోని 3 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, యలమంచిలి మున్సిపాలిటి లోని 2 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, గ్రామీణ ప్రాంతంలోని 47 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఏజెన్సీ లోని 36 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, ఇంకా జిల్లా అంతటా వున్న 16 వైద్య విధాన పరిషత్ ఆసుపత్రులలో వేస్తారు. కో వ్యాక్సిన్ ను నగరంలోని ప్రాంతీయ కంటి ఆసుపత్రి, చెవి ముక్కు గొంతు ఆసుపత్రులలో, కె.జీ.హెచ్. లోని సూపర్ స్పెషాలిటీ బ్లాక్ లో, స్వర్ణ భారతీ ఇండోర్ స్టేడియంలో, అనకాపల్లిలోని అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ లో , నర్సీపట్నంలోని టిబి కంట్రోల్ సెంటర్ లో , పాడేరులోని జిల్లా ఆసుపత్రిలో వేస్తారు. నగరంలోని కె.జి.హెచ్. ఆసుపత్రిలో విడివిడిగా ప్రత్యేక బ్లాకులలో రెండు రకాల వ్యాక్సిన్ లు కోవీ షీల్డ్, కో వ్యాక్సిన్ వేస్తారని తెలిపారు. కాబట్టి వ్యాక్సిన్ మొదటి డోసు వేసుకున్న ప్రతీ ఒక్కరూ రేపు రెండవ డోసు తప్పని సరిగా వేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. వ్యాక్సిన్ వేసుకోవడానికి వెళ్లేటప్పుడు తమ అధార్ కార్డ్ ను వెంట తీసుకొని వెళ్లాలని కోరారు. జిల్లాలో ప్రస్తుతం 60 వేల డోసులు అందుబాటులో వున్నాయని, ఇంకా అదనంగా డోసులు రానున్నాయని తెలిపారు.

కోవిడ్ ఇన్ఫెక్షన్ సోకి రికవరీ అయి 28 రోజులు గడిచిన వ్యక్తులు బ్లడ్, ప్లాస్మా దానం చేయవచ్చునని, కాబట్టి అలాంటి వారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి బ్లడ్, ప్లాస్మాను దానం చేసి, ఇతరుల ప్రాణాలను కాపాడాలని జిల్లా కలెక్టరు విజ్ఞప్తి చేసారు.

ఈ కార్యక్రమం లో జాయింట్ కలెక్టర్ పి.అరుణ్ బాబు, జి.వి.యం.సి. కమీషనర్ డా. జి.సృజన, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.సూర్యనారాయణ, ఆంధ్రా మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా.పి.వి.సుధాకర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



# నేడు రెండవ డోసు టీకా మాత్రమే



శ్రీకాకుళం : గురువారం రెండవ డోసు టీకాను మాత్రమే వేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. మొదటి డోసు వేసుకుని రెండవ డోసు టీకాకు అర్హత పొందిన వ్యక్తులకు మాత్రమే రెండవ డోసు టీకా ఇవ్వడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. గురువారం జిల్లాలో మొదటి డోసు టీకా ఇవ్వడం జరగదని ఆయన తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన జారీ చేస్తూ రెండవ విడతకు అర్హత పొందిన వ్యక్తులు సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాలలో రెండవ డోసు టీకాను పొందాలని కలెక్టర్ కోరారు.

రెండవ డోసు కోవాక్సిన్ లభించే ప్రదేశాలు : శ్రీకాకుళం నగరంలో

1.ఆదివారం పేట యు.హెచ్.సి

2.బర్మా కాలనీ యు.హెచ్.సి

3. గుజరాతీ పేట యు.హెచ్.సి

4. రణస్థలం మండలం - పాతర్లపేట పి.హెచ్.సి

5. రాజాం మండలం - పొగిరి పి.హెచ్.సి

6. పాలాకి పి.హెచ్.సి

7. ఎచ్చెర్ల మండలం - పొన్నాడ పి.హెచ్.సి

8. ఆమదాలవలసలో - ఐ. జె.నాయుడు కాలనీ యు.హెచ్.సి

మిగిలిన ప్రదేశాల్లో కోవిషీల్డ్

రెండవ డోసు లభిస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు.



*గ్రేటర్ విశాఖ 57 వ వార్డు లోని ఆశవాని పాలెం లో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వార్డు టిడిపి యువ నాయకుడు కార్తీక్ కుట్టి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే షిరిడి సాయిబాబా ఆలయ 21 వ వార్షికోత్సవం లో పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గేదెల నర్సింగరావు, జి తిరుపతిరావు, జగదీష్, శ్రీనివాసరావు, రమణ అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.*

# క్షేత్రం ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు



మధురవాడ : మహా విశాఖ 5 వ వార్డ్ పరిధి బోరవానిపాలెంలో క్షేత్రం మిల్క్ అండ్ డైరీ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు, 2018 లో బోరవానిపాలెంలో సుమారు 2 ఏకరాలలోసుమారు 40 అవులు 8 దుడలు తో స్థాపించారు. ఈ ప్రాంగణంలోనే బుధవారం శ్రీరామనవమి వేడుకలు వెద పండితుల నడుమ అంగరంగ వైబోవంగ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ నాటు ఆవుల ఉత్పత్తుల ద్వారా సుమారు 165 రకాలు మెడికల్, హొమ్ ప్రొడక్ట్ లును తయారు చేస్తున్నారు అలాగే పంచ దీపాలను,తైలాలను.

సహాజ సిద్దంగా ప్రకృతికి హానికరంగా లేనటువంటి వాటిని నిత్యం వాడుకునే విధంగా అగరబత్తీలుగా చేసి వెలిగించు కోవటం వలన కరోనా నుండి మన ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు, మేనేజింగ్ పార్టనర్ పి. విజయలక్ష్మి, డి. గీత దేవి తదితరులు పాల్గున్నారు.



***శ్రీరామనవమి శుభ సందర్భంగా రామకృష్ణ వీధి లో కొలువైన సీతారాములు ఆలయ ప్రాంగణంలో శివ కుమార్ ఏర్పాటుచేసిన అన్నదానం కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 35వ వార్డు అధ్యక్షులు, అలుపనకనకరెడ్డి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 39వార్డు నాయకురాలు, కొల్లి సింహాచలం, వైయస్సార్ సిపి నాయకులు బొగ్గు శ్యాము, మల్ల బుజ్జి, గండి బోయిన రమణ తదితరులు పాల్గొన్నారు.***

## ఆర్.బి.కె ల ద్వారా
# ధాన్యం కొనుగోలు

శ్రీకాకుళం : రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. జిల్లాలో 2020-21 ఖరిఫ్ సీజన్ లో 246 ధాన్యం కొనుగోలు కేంద్రాలకు అనుసంధానం చేసిన 837 రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని ఆయన వివరించారు. ప్రభుత్వం ప్రటించిన కనీస మద్దతు ధరకు ధాన్యం సేకరించడం జరుగుతుందని ఆయన స్పష్టం చేసారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతం నిర్ధారించుటకు ప్రభుత్వం సరఫరా చేసిన నాణ్యత ప్రమాణాలు గల ఇండోసా తేమ నిర్దారించే పరికరాల ను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు వద్ద నమోదు చేసిన తేమ శాతంను మాత్రమే పరిగణన లోనికి తీసుకోవడం జరుగుతుందని, తదనుగునంగా రైతులకు మద్దతు ధర చెల్లిస్తామని జాయింట్ కలెక్టర్ వివరించారు. రైస్ మిల్లర్ల వద్ద గల తేమ నిర్దారణ పరికరాల (మొయిశ్చర్ మీటర్లు) విలువలు పరిగణనలోకి తీసు కోవడం జరగదని ఆయన స్పష్టం చేశారు.

# కోవిడ్ వ్యాప్తి నివారణకు సహకరించాలి



శ్రీకాకుళం : కోవిడ్ వ్యాప్తి నివారణకు సహకరించాలని రెవెన్యూ డివిజనల్ అధికారి ఐ.కిషోర్ అన్నారు. శ్రీకాకుళం నగర వర్తకులతో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో కేసులు అధికంగా పెరుగుతున్నాయని అన్నారు. బుధవారం ఉదయం నివేదిక ప్రకారం 1,444 కేసులు జిల్లాలో నమోదు అయ్యాయని తెలిపారు. సెకండ్ వేవ్ మ్యుటేషన్ విభిన్నంగా ఉందని ఆయన చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఏ విధమైన చర్యలు చేపట్టాలి అని ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. వర్తక, వాణిజ్య రంగాలు సహకరించి కేసుల తగ్గుదలకు ప్రయత్నం చేయాలని కోరారు. వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు సమయాన్ని నియంత్రించేందుకు కృషి చేయాలని అన్నారు. మీ ఆరోగ్యం, మీ కుటుంబ సభ్యుల ఆరోగ్యం గూర్చి ఆలోచించాలని ఆర్.డి.ఓ పేర్కొన్నారు. దుకాణాలకు వచ్చే వినియోగదారులు విధిగా మాస్కు ధరించాలని ఆయన స్పష్టం చేసారు. కోవిడ్ నిబంధనలు ప్రతి దుకాణం విధిగా పాటించాలని ఆయన పేర్కొన్నారు. నిర్దేశించిన సమయం ప్రతి రంగానికి వర్తిస్తుందని ఆయన స్పష్టం చేసారు. గురువారం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉదయం10.30 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వ్యాపార వర్గాలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు.

డిఎస్పీ ఎం.మహేంద్ర మాట్లాడుతూ వ్యాపార వర్గాలు మనస్ఫూర్తిగా సహకరించాలని కోరారు. అందరూ ఒకే మాటపై ఉండాలని సూచించారు. నగర పాలక సంస్థ కమీషనర్ కె.శివప్రసాద్ మాట్లాడుతూ గత వారం రోజుల్లో వెయ్యి కేసులు నమోదయ్యాయని తెలిపారు. మార్చి 1 నుండి నగరంలో 16 వందల కేసులు నమోదు అయ్యాయని ఆయన చెప్పారు. జిల్లాలో ఎక్కువ కేసులు శ్రీకాకుళం నగరంలో వస్తున్నాయని ఆయన వివరించారు. ఓబిఎస్ మార్కెట్ ను 80 ఫీట్ రోడ్ లోకి మార్చడం జరిగిందని, లక్ష్మి టాకీస్ వద్ద మార్కెట్ ను కోడి రామమూర్తి స్టేడియంలోకి మార్చడం జరిగిందని ఆయన వివరించారు. ఇతర మార్కెట్లను మార్పు చేయుటకు చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. వ్యాపార వర్గాల ప్రతినిధులు పి.వి.రమణ, కోరాడ రమేష్, కోరాడ హరగోపాల్ మాట్లాడుతూ వ్యాపార వర్గాలు సహకరించుటకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుటకు అవకాశం కల్పించాలని కోరారు. మార్కెట్లు విశాల ప్రాంతాల్లోకి మార్చునపుడు అచ్చట సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పోలీసు ఇన్స్పెక్టర్ అంబేద్కర్, ఎస్.ఐ లు విజయ్ కుమార్, సిద్దార్థ కుమార్ , వ్యాపార వర్గాలు తదితరులు పాల్గొన్నారు.

## డా.అడ్డాల ఆధ్వర్యంలో
# ఘనంగా సీతారాముల కళ్యాణం



కాకినాడ రూరల్ : డా.అడ్డాల సత్యనారాయణ జానకి రమ దంపతుల ఆధ్యంలో' స్థానిక అశోక్ నగర్‌లో శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా జరిగింది.ఈ సంధర్భంగా డా.అడ్డాలసత్యనారాయణ మాట్లాడుతూ"ప్రతీ ఏటా శ్రీరామ నవమి వేడుకలు చేయటం తమ అదృష్టంగా భావిస్తున్నామని,ఈ ఏడాది కూడా ప్రజలంతా శ్రీరామ రక్షతో కరోనా మహమ్మారి నుంచి విముక్తి పొంది ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని అన్నారు.ఈ కార్యక్రమంలో అరుణరేఖ,వీరభద్రరావు,సత్య సాహితి తదితరులు పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

## నాసిక్ ఘటన
# కలచివేసింది

ఆదేశించింది. మృతుల కుటుంబాలకు రూ.5లక్షల పరిహారం ప్రకటించింది. మరోవైపు ఇదో భయంకరమైన ఘటన అని మాజీ ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ అన్నారు. అదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులను వేరే చోటకి తరలించాలని కోరారు. పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని ఎన్సీపీ నేత ముజీబ్ మేమన్ డిమాండ్ చేశారు.

## హనుమంతుడి జన్మస్థలం
# అంజనాద్రే

ఉన్నాయి. త్రేతాయుగంలో దీన్ని అంజనాద్రిగా పిలిచారు. అంజనాదేవికి తపోఫలంగా హనుమంతుడు జన్మించాడు. సూర్యబింబం కోసం వేంకటగిరి నుంచే హనుమ ఎగిరాడు. 12 పురాణాలు ఆంజనేయుడు తిరుమల కొండల్లోనే పుట్టాడని చెబుతున్నాయి. జాపాలీ తీర్థమే ఆయన జన్మస్థలంగా ప్రకటిస్తున్నాం. హంపీ విజయనగరం అంజనాద్రి కాదు. వాలి ఏలిన కిష్కింద కాబట్టి వానర సైన్యం ఆనవాళ్లు ఉండొచ్చు. నాసిక్, జార?ండ్, గుజరాత్, మహారాష్ట్ర.. ఇవేవీ అంజనాద్రి కావు. ఛత్తీస్‌గఢ్, నాసిక్ పరిశోధకులు సహ అందరికీ దీన్ని స్పష్టం చేస్తున్నాం. 12, 13 శతాబ్దం నాటి ఎన్నో రచనల్లో అంజనాద్రి ప్రస్తావన ఉంది. అన్నమయ్య కీర్తనల్లో వేంకటాచలాన్ని అంజనాద్రిగా వర్ణించారు" అని మురళీధర శర్మ వెల్లడించారు.

హనుమ జన్మస్థానంపై అన్వేషణకు ఏర్పాటు చేసిన కమిటీలో మురళీధర శర్మతో పాటు ఎస్వీ వేద విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సన్నిధానం సుదర్శన శర్మ, ఆచార్య రాణి సదాశివమూర్తి, ఆచార్య జానమద్ది రామకృష్ణ, ఆచార్య శంకరనారాయణ, ఇస్రో శాస్త్రవేత్త రేమెళ్ల మూర్తి, రాష్ట్ర పురావస్తు శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్ సభ్యులుగా ఉన్నారు. తితిదే ఎస్వీ ఉన్నత వేదాధ్యయన సంస్థ ప్రాజెక్టు అధికారి డా.ఆకెళ్ల విభీషణశర్మ కన్వీనర్‌గా వ్యవహరించారు.

# కరోనా బారిన మరో కేంద్రమంత్రి

ఇటీవలి కాలంలో తనను కలిసిన అధికారులు, సన్నిహితులు అందరూ అప్రమత్తంగా ఉండాలంటూ ట్వీట్ చేశారు. అందరూ కరోనా పరీక్షలు చేయించుకోవడంతోపాటు, కొద్ది రోజులపాటు హెూమ్ క్వారెంటైన్‌లో ఉండాలని పోఖ్రియాల్ సూచించారు.

కాగా ఇప్పటికే పలు రాష్ట్రాలు ముఖ్యమంత్రులు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కరోనా బారిన పడ్డారు. ఈ వారంలో భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు, కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీకి కరోనా వైరస్ సోకిన సంగతి తెలిసిందే. మరోవైపు దేశంలో రోజు రోజుకు వైరస్ కేసుల సంఖ్య రికార్డు స్థాయిలో నమోదవుతున్న కేసులు దాదాపు మూడు లక్షలకు చేరువలో ఉన్నాయి. అలాగే మరణాల సంఖ్య తాజాగా రెండువేల మార్క్‌ను దాటడం మరింత ఆందళన రేపుతోంది.

# ఏపీలో 9,716 కేసులు.. 38 మరణాలు

కోలుకోవడంతో రాష్ట్ర వ్యాప్తంగా కోలుకున్న వారి సంఖ్య 9,18,985కి చేరినట్లు వైద్యారోగ్య శాఖ తెలిపింది. ప్రస్తుతం రాష్ట్రంలో 60,208 యాక్టివ్ కేసులున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 1,57,93,298 నమూనాలను ఆరోగ్య శాఖ పరీక్షించింది. అత్యధికంగా శ్రీకాకుళంలో 1,444, అత్యల్పంగా పశ్చిమ గోదావరి జిల్లాలో 106 కేసులు నమోదయ్యాయి.

## నేడు సర్పంచ్ లకు
# జూమ్ యాప్ ద్వారా శిక్షణ

శ్రీకాకుళం : జిల్లాలో సర్పంచులు వార్డు సభ్యులకు గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి బి.లక్ష్మీపతి తెలిపారు. శిక్షణా కార్యక్రమం కోవిడ్ నియమ నిబంధనలను అనుసరించి చేపట్టడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేస్తూ 19వ తేదీన టిఓటి లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. 22వ తేదీ ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జూమ్ యాప్ ద్వారా ఆన్ లైన్ లో సర్పంచు లకు, వార్డు సభ్యులకు శిక్షణ జరుగుతుందని అన్నారు. మండలంలో 3 ప్రదేశాల్లో శిక్షణ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతీ కేంద్రం వద్ద ఒక టి.ఓ.టి తప్పనిసరిగా ఉండాలని ఆయన స్పష్టం చేసారు.

స్క్రీన్ ఆపరేటింగ్ నిమిత్తం ఒక డిజిటల్ అసిస్టెంట్ ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కేంద్రంలో 50 మంది మాత్రమే ఉండాలని ఆయన అన్నారు.

ప్రతి ఒక్కరూ మాస్క్ లు ధరించాలని, శానిటైజర్లు ఉపయోగించాలని ఆయన ఆదేశించారు

# కరోనా తీవ్రత అధికంగా ఉంది




శ్రీకాకుళం : జిల్లాలో ముఖ్యంగా శ్రీకాకుళం, పలాస, రాజాం, పాలకొండ, టెక్కలి తదితర పట్టణ ప్రాంతాల్లో కరోనా తీవ్రత అధికంగా ఉందని జిల్లా కలెక్టర్ జె నివాస్ తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఆస్పత్రులలో ప్రవేశాలు పెరుగుతున్నాయని అన్నారు. ప్రతి ఒక్కరూ కరోనా కట్టడికి చర్యలు చేపట్టాల్సిన అవసరం వచ్చిందని స్పష్టం చేశారు . మాస్కు విధిగా ధరించాలని, భౌతిక దూరం పాటించాలని, చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలని ఆయన అన్నారు. మాస్కు ధరించని వారిపై 100 రూపాయలు అపరాధ రుసుమును విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. వేడుకలు చేసుకోవద్దని వేడుకలకు హాజరు కాకుండా ఉండాలని ఆయన అన్నారు. వివాహ మహోత్సవాలు సైతం ఉన్న సామర్థ్యంలో 50 శాతం వరకు మాత్రమే హాజరు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విషయంపై తహసీల్దార్లను అప్రమత్తం చేశామని, నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. సినిమా హాల్లో సైతం ఒక సీట్ కి ఒక సీట్ కి మధ్య విధిగా ఖాళీ ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని ఆయన అన్నారు. కోవిడ్ పెరుగుతున్న దృష్ట్యా ఆస్పత్రుల్లో బెడ్ల సంఖ్య పెంచుతున్నామని, ఇప్పటివరకు కొరత లేదని ఆయన పేర్కొంటూ ఇటీవల కాలంలో ఆసుపత్రిలో చేరే వారి సంఖ్య పెరుగుతుందని, ఒకేసారి ఎక్కువ సంఖ్యలో వస్తే వారందరికీ కేటాయింపుల్లో కొంత జాప్యం జరిగే అవకాశం ఉంటుందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్త చర్యలు పాటించడమే మంచిదని ఆయన తెలిపారు. కరోనా పరీక్షలు రోజుకు ఐదు వేలు చేయుటకు సామర్థ్యాన్ని పెంపుదల చేశామని ఆయన చెప్పారు.

శ్రీకాకుళంలో మంగళవారం వెయ్యి పరీక్షలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఫీవర్ సర్వే జరుగుతుందని కోవిడ్ లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని తమ సమస్యను స్పష్టంగా తెలియజేయాలని ఆయన కోరారు. కళాశాలలు, పాఠశాలల్లో ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు.

# నిరాడంబరంగా శ్రీరామ నవమి వేడుకలు

**-ఆదర్శపురుషుడు శ్రీరాముడు    - గాజువాక బీజేపీ నేత కరణంరెడ్డి నరసింగరావు**



గాజువాక : శ్రీరామ నవమి సందర్భంగా 72వ వార్డు పాతకర్నవానిపాలెంలో రామాలయ ప్రాంగణంలో గ్రామ కమిటీ పెద్దలు సిరసపల్లి అప్పారావు గొంతిన.దేముడు ఆద్వర్యంలో బుధవారం నిరాడంబరంగా పూజలు నిర్వహించారు. బీజేపి గాజువాక నియోజకవర్గ కోఆర్డినేటర్ కరణంరెడ్డి. నరసింగరావు జ్యోతి దంపతుల చేతుల మీదుగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ గత 14 సం.లు మా దంపతుల చేతులమీదుగా కళ్యాణం నిర్వహించడం మా పూర్వజన్మ సుక్రుతమని అన్నారు. కారణజన్ముడు ఆదర్శ పురుషుడు శ్రీరామ చంద్రుడని ఆయన తండ్రిమాట జవదాటని వారని, మంచి సుపరిపాలన అందించారని అందుకే ప్రతి గ్రామంలో శ్రీరాముడికి ఆలయం కట్టి నిత్యం పూజిస్తున్నామన్నారు. అందరూ రామరాజ్యం కావాలని కోరుకుంటారని మన దేశ ప్రదాని నరేంద్ర మోదీ కూడా సుపరిపాలన అందిస్తున్నారని అన్నారు. కరోనా కారణంగా ఈ సం. అన్నసమారాదన పెట్టలేదని, పూజలో కూడ కేవలం నలుగురు మాత్రమే పాల్గొన్నామని చెప్పారు. భక్తులకు ప్రసాదాలను బీజేపి నేత కరణంరెడ్డి. నరసింగరావు ఆర్థిక సాయం చేసారని చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ పెద్దలు గొంతిన దేముడు, జనపరెడ్డి, మణి, సాలాపు శివ, కరణం రామకృష్ణ, మడగల కన్నయ్య, రాంబాబు, ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

# కోవిడ్ -19 నియమ నిభందనల మేరకు
# ఏకాంతంగా శ్రీస్వామివారి కళ్యాణం



విశాఖపట్నం : దేవాదాయ ధర్మదాయశాఖ శ్రీకనక మహలక్ష్మి అమ్మవారి దత్తత దేవాలయం అయిన శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం అంబికాబాగ్ విశాఖ పట్నం నందు శ్రీప్లవనామ సంవ త్సర శ్రీరామ నవమి ఉత్సవ ములను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మరియు దేవాదాయ ధర్మ దాయ శాఖ కమిషనర్ వారి ఆదేశముల మేరకు కోవిడ్ - 19 నియమ నిభంద నల మేరకు నేడు శ్రీస్వామివారి కళ్యాణం ఏకాంతంగా నిర్వాహించుట జరిగినది.

ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహణాధికారిని యస్.జే.మాధవి మరియు అలయాధికారులు, వేద పండితులు సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీ రామనవమి సందర్భంగా షిర్డీసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు



భీమునిపట్నం : శ్రీ రామనవమి సందర్భంగా బుధవారం స్థానిక షిర్డీసాయి ఆలయంలో షిర్డీసాయి సేవాసమితి ఆధ్వర్యంలో షిర్డీసాయి ఆలయం 30 వ వార్షకోత్సవం. సందర్భంగా సాయి బాబా కి విశేష పూజలు నిర్వహించి అనంతరం సీతా రాముల కళ్యాణం షిర్డీసాయి ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అంపోలు శేషగిరి శర్మ. శశికళ దంపతులు. జ్యోతి భాస్కర్ దంపతులు నిర్వహించారు. అలాగే సాయంత్రం 3గంటలకు పల్లకీ ఉత్సవం, సాయంత్రం హారతి, చందనోత్సవం, భజన కార్యక్రమాలు,రాత్రి 9గంటలకు శేషహారతి ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించారు .ఈ కార్యక్రమంలో అర్ నర్సింగ రావు, సన్ని బాబు, దివాకర్, తదితరులు పాల్గొన్నారు

# వెలంపేట రామాలయంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



విశాఖపట్నం : జీవీఎంసీ 35 వ వార్డు వెలంపేట రామాలయంలో కార్పొరేటర్ విల్లూరి భాస్కర్ రావు ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి సహస్రనామార్చన, కలసి పూజ,రామాయణ పారాయణం నిర్వహించారు. అనంతరం శ్రీరాముని, సీతాదేవి అమ్మవారలను పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా అలంకరించి కల్యాణ మహోత్సవాన్ని ప్రారంభించారు. విల్లూరి భాస్కరరావు దంపతులు కల్యాణ మహోత్సవంలో సంప్రదాయబద్ధంగా పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ పురోహితులు శాస్త్రోక్తంగా జరిపిన ఈ వేడుకలకు అనేకమంది భక్తులు హాజరై కనులార సీతారాముల కల్యాణాన్ని వీక్షించారు.అనంతరం విల్లూరి భాస్కర రావు దంపతులు అన్నసంతర్పణ కార్యక్రమంలో పాల్గొని తమ చేతులమీదుగా భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# కాకరపాడులో ఘనంగా సీతారాముల కళ్యాణం



కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు : కొయ్యూరు మండలంలో కాకరపాడు లో గల శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణాన్ని జలుమూరు కుటుంబ సభ్యులు అత్యంత ఘనంగా నిర్వహించారు. సీతా రాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఎంవివిఎస్.ప్రసాద్ సీతారాముల కల్యాణాన్ని తిలకించారు. సీతారాముల ఆశీస్సులు ప్రతి కుటుంబానికి ఉండాలని వారు కోరారు. పండితులు రాంబాబు భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు భోజన వసతి కల్పించారు. ప్రతి ఏటా కాకరాపాడు గ్రామంలో ప్రతియేటా తీర్థాన్ని నిర్వహిస్తూ ఉండేవారు. అయితే కరోనాను దృష్టిలో పెట్టుకొని గత సంవత్సరము తీర్థంను రద్దు చేశారు. ఈ సంవత్సరం కూడా కరోనా సెకండ్‌వేవ్ కారణంగా తీర్థాన్ని రద్దు చేశారు. ప్రజలు అందరూ కరోనా బారిన పడకుండా, సుఖ సంతోషాలతో ఉండాలని ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు జలుమూరు కుటుంబసభ్యులు గణ బాబు తెలిపారు. అయితే ఈ సంవత్సరమైనా తీర్థం ఉంటుందని కొంత మంది యువతీ యువకులు ఎంతో ఉత్సాహంగా ఉల్లాసంగా ఎదురు చూశారు. కరోనా సెకండ్‌వేవ్ కారణంగా రావడంతో నిరుత్సాహపడ్డారు. జలుమూరు కుటుంబం కాకర పాడు తీర్థం రద్దు చేయడం పట్ల చాలా సంతోషంగా ఉందని ప్రసాద్ తెలిపారు. ఏజెన్సీలో కొన్ని ప్రాంతాల్లో తీర్థాలు జరిగాయని, కానీ కరోనా కారణంగా జలుమూరు కుటుంబ సభ్యులు తీసుకున్న నిర్ణయం మంచిదన్నారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో జరిగే తీర్థ మహోత్సవాలు జరగకుండా ఉంటే మంచిదనే ఆయన అభిప్రాయపడ్డారు. కరోనా పట్ల అందరూ జాగ్రత్త వహించాలని, సామాజిక దూరం పాటిస్తూ మాస్కలు ధరించాలన్నారు. అవసరమైతే తప్ప బయటకు రావద్దని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జలుమూరు కుటుంబ సభ్యులు, జలుమూరు గిరిబాబు, చంద్రశేఖర్, గోవిందుతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, నౌంద్ర శ్రీను, నాని, లోవరాజుతో పాటు పలువురు పాల్గొన్నారు.

# శ్రీరాములను దర్శించుకున్న అరకు ఎంపీ మాధవి దంపతులు



కొయ్యూరు : కొయ్యూరు మండలం శరభన్నపాలెంలో అరకు ఎంపి గొడ్డేటి మాధవి దంపతులు కుటుంబ సమేతంగా బుధవారం సందర్శించారు.

శ్రీరామ చంద్రున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తెలుగు రాష్ట్రాల ప్రజలందరికీ శ్రీరామ నవమి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో శరభన్నపాలెం సర్పంచ్ కిముడు సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాస్కుల పంపిణీ



లంకెలపాలెం : గ్రేటర్ విశాఖ 79 వ వార్డు లంకెలపాలెం జంక్షన్ లోని శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీరామనవమి సందర్భంగా సొసైటీ ఫర్ బెటర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో భక్తులకు 1000 మాస్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు కరోనా పై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరు మాస్క్ ధరించాలని, సామాజిక దూరం పాటించాలని సంస్థ ప్రధాన కార్యదర్శి మడక రమేష్ నాయుడు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాదాసు వాసు దేవరావు, తురుసాల నర్సింగరావు, బలివాడ మహేశ్వరరావు, సాయి, శ్రీనివాస్ కుమార్, మేడిశెట్టి దుర్గారావు, ఎర్ర అప్పలరాజు, బొక్కా మురళి తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ రామ తారక ఆంధ్ర ఆశ్రమం లో సీతారామ కళ్యాణం



విశాఖసిటీ : శ్రీరామనవమి సందర్భంగా కాశీలోని శ్రీ శ్రీ శ్రీ రామభద్ర రేంద్ర సరస్వతి స్వామి వారిచే స్థాపించబడిన శ్రీ రామ తారక ఆంధ్ర ఆశ్రమం లో సీతా రామ కళ్యాణం చాలా వైభవంగా జరిగినది ఈ సంవ త్సరము కరోనా మహ మ్మారి అధికంగా ఉండటం వలన కరోనా నియమములను పాటిస్తూ తక్కువ మంది భక్తులతో కార్యక్రమం జరి గింది. ప్రతి సంవత్సరము నాలుగు రోజుల జరిగే ఈ కార్యక్రమాన్ని ఆశ్రమం మేనే జ్మెంట్ వారు ఒక్కరోజు సీతారామ కళ్యాణం తోనే ముగించ వలసిదిగా నిర్ణయిచారు ఈ కార్యక్రమము ఉదయము తొమ్మిదిన్నర గంటలకు మొదలై మధ్యాహ్నం ఒకటిన్నర గంటల వరకు జరిగింది శ్రీ సీతారాముల కళ్యాణము ఆశ్రమం మేనేజింగ్ ట్రస్టీ వేమూరి వెంకట సుందర శాస్త్రి మరియు ఉమా దంపతులు పీటలమీద కూర్చుని చేసినారు ఈ కార్యక్రమంలో గణపతి పూజ మండపారాధన కంకణ దేవతాపూజ అష్ట దిక్పాలక పూజ గౌరీ పూజ రాములవారికి రజిత యజ్ఞోపవీత ధారణ జీలకర్ర బెల్లము ముహూర్త సమయంలో ధారణ మంగళసూత్రధారణ తలంబ్రాలు మరియు హారతి మంత్రపుష్పం తో ఈ కార్యక్రమం పూర్తి అయ్యింది తదనంతరం భక్తులకు ప్రసాద వితరణ మరియు అన్నదానం కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమంలో ముఖ్యంగా సి వి బి సుబ్రహ్మణ్యం, సోమయాజులు, పొంగలి కిషోర్ కుమార్, ఏ ఏ నరసయ్య, పురుషోత్తం, నరసింహ మూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ఆశ్రమం మేనేజర్ సీతారాం ఆధ్వర్యంలో జరిగింది

# ప్రజల త్రాగునీటి కోసం
# మంచి నీటి కేంద్రం ఏర్పాటు



గాజువాక : జీవీఎంసీ 73 వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో ప్రజల తాగునీటి అవసరాల మేరకు మంచినీటి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని గాజువాక వైసీపీ ఇన్చార్జి తిప్పల దేవన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇటువంటివి ఎంతో ఉపయోగపడ తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తిప్పల గురుమూర్తి రెడ్డి, చింతల పూడి వెంకట్రా మయ్య, వైకాపా నాయకులు భూపతిరాజు శ్రీనివాసరావు, రెడ్డి జగన్నాథం, వైసీపీ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# విజయభాను సంపాదకీయం

## లక్ష్య సాధనలో ప్రజాసంబంధాలు

ఇది కమ్యూనికేషన్ల యుగం. ప్రపంచ సమస్త సమాచార వ్యవస్థ అరచేతిలోకి వచ్చింది. ఏ సమాచారమైనా కొన్ని సెకన్లలోనే విశ్వవ్యాప్తమవుతుంది. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియా దినదినం కొత్త పుంతలు తొక్కుతూ సామాన్యునికి సైతం అత్యంత చేరువైన నేపథ్యంలో ప్రజాసంబంధాల వ్యవస్థ పటిష్ఠమవుతున్నది. సరళీకృత ఆర్థిక విధానాలు, గ్లోబలైజేషన్ ఫలితాలు ప్రపంచంలో సమాచార విప్లవం తీసుకొచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రజాసంబంధాల (పీఆర్) వ్యవస్థ ఒక పరిశ్రమ స్థాయికి చేరుకుంది.

నది అతిపెద్ద ప్రజాస్వామిక దేశం. ప్రజల కోసం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ఆయా నిర్దేశిత వర్గాలకు చేరాలంటే, లక్ష్యాలు నెరవేరాలంటే ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలాగా పనిచేసే సమాచార వ్యవస్థ పటిష్ఠంగా ఉండాలి. అన్ని ప్రభుత్వ శాఖల కార్యక్రమాలు ప్రచారం లేనిదే విజయవంతం కావడం అసాధ్యమనిపిస్తున్నాయి. ప్రైవేట్ కార్పొరేట్ రంగంలో 'ప్రచారం' అనేది అతి ముఖ్యమైన అంశం. వస్తు సేవలు వినియోగదారులకు చేరువ కావాలంటే ప్రణాళికాబద్ధమైన, ఆకర్షణీయమైన ప్రచారం అవసరం. కార్పొరేట్ సంస్థలు ప్రచారం కోసం దాదాపు 20 నుంచి 30 శాతం ఖర్చు పెడుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలే కాకుండా ఇప్పుడు ప్రతి చిన్నా, చితకా వాణిజ్య వ్యాపార సంస్థలు కూడా ప్రచారం మీద ఆధారపడుతున్నాయి. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రాం తదితర సామాజిక మాధ్యమాల విస్తృతి నేపథ్యంలో ప్రతి పౌరుడు ఒక పీఆర్వోగా మారుతున్న పరిస్థితి. సామాజిక మాధ్యమాలలో పోటాపోటీగా పోస్టింగులు వస్తుంటాయి. ఇటీవలి అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల తీరు తెలిసిందే.

ఒకప్పుడు ప్రభుత్వాలు కేవలం సమాచార ప్రసార ప్రజాసంబంధాల శాఖలపైన ఆధారపడేవి. మారుతున్న పరిస్థితుల్లో ప్రతి శాఖలో ఒక ప్రత్యేక సమాచార విభాగ ఏర్పాటు అవసరమవుతున్నది. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన తర్వాత ఈ అవసరం మరింత పెరిగింది. మారుమూల ప్రాంతాల్లోకి కూడా మీడియా చొచ్చుకువెళ్ళిన పరిస్థితులలో ప్రతి ఉద్యోగికి సమాచార ప్రచార సాధనాల పట్ల అవగాహన ఉండాల్సిన ఆవశ్యకత ఏర్పడింది.

ఈ నేపథ్యంలో కొత్త అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సి వస్తుంది. ఉద్యోగ నియామక ప్రక్రియ మొదలు నుంచే ఐఏఎస్ స్థాయి నుంచి ఆఫీస్ సబార్డినేట్ వరకు ప్రతి ఉద్యోగికి ప్రజాసంబంధాలపైన సంపూర్ణ అవగాహన ఉండేలా శిక్షణ ఇప్పించాలి. పీఆర్వోల నియామక అంశాన్ని ఔట్‌సోర్సింగ్ విధానానికే పరిమితం చెయ్యకుండా ప్రజాసంబంధాల వ్యవస్థను పటిష్ఠంగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది. రాజనీతిశాస్త్రం, పరిపాలనాశాస్త్రం వంటి సామాజిక శాస్త్రాల్లాగానే ప్రజాసంబంధాల అధ్యయనం కీలకంగా మారబోతున్నది. రానున్న రోజుల్లో ప్రజాసంబంధాలు, అనుబంధ మీడియా, అడ్వైర్టైజింగ్, కమ్యూనికేషన్ వంటి అంశాల పట్ల లోతైన అధ్యయనం చేయాల్సిన ఆవశ్యకత క్రమక్రమంగా పెరుగుతుంటుంది. భావి అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజాసంబంధాలను ఒక నూతన శాస్త్రంగా భావించి విశ్వవిద్యాలయాల్లో కళాశాలల్లో తప్పనిసరి అధ్యయనాంశంగా చేయాలి. ప్రాథమిక విద్యాస్థాయి నుంచే ప్రజాసంబంధాల పట్ల అవగాహన కలిగించే విధంగా చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

# తెలుగు రాష్ట్రాల్లో తేలికపాటి వర్షాలు

హైదరాబాద్: తెలంగాణలో రానున్న మూడు రోజులు ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గంటకు 30కి.మీ. నుంచి 40కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీస్తాయని తెలిపింది. ఈ రోజు ఉత్తర-తూర్పు ఉపరితల ఆవర్తనం దక్షిణ తమిళనాడు నుంచి ఇంటీరియర్ కర్ణాటక వరకు సముద్ర మట్టానికి 1.5కి.మీ. ఎత్తులో ఏర్పడిందని వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు ఉత్తర కోస్తాంధ్రలో వచ్చే మూడు రోజులు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం వాతావరణ కేంద్రం ప్రకటించింది. అలాగే రాయలసీమలోనూ ఒకట్రెండు చోట్ల వర్షాల పడతాయని తెలిపింది.

# వైభవంగా 46వ వార్డు శాంతినగర్ శ్రీరామాలయంలో శ్రీ రామనవమి వేడుకలు



తాటిచెట్ల పాలెం : జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం పరిధి శాంతినగర్ లో ఉన్న శ్రీరామలయంలో శ్రీరామనవమి వేడుకలు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బుధవారం అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ పెద్దలు నిర్వహించారు. భక్తులు సీతారాముల వారికి ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు కల్యాణ వేదిక వద్ద ఆలయ అర్చకులు జి టి రామాచార్యులు సమక్షంలో స్వామివారి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఉత్తరనియోజక వర్గం వై ఎస్ ఆర్ సిపి సమనవ్యయకర్త కె కె రాజు పాల్గొని స్వామివారి కళ్యాణవేడుకలు తిలకించారు.ఈ కళ్యాణ వేడుకల్లో.జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్,జీవీఎంసీ కో అప్షన్ మెంబర్ సేనాపతి అప్పారావు, చిన్న,రాఘవులు, కృప పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు. దూది నరసింగరావు, ఆలయ కమిటీ సభ్యులు కె రామ్మూర్తి, ఎం కనకరాజు, సోమినాయుడు పర్యవేక్షణలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పరిసర ప్రాంతాలు నుంచి కోవిడ్ నిబంధనలు పాటిస్తూ భక్తులు శ్రీరాములవారి కల్యాణాన్ని తిలకించారు.

### బర్మా క్యాంప్ శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయంలో

# నిరాడంబరంగా శ్రీ సీతారాముల కళ్యాణం

- కోవిడ్ నిబంధనలు పాటిస్తూ స్వామివారిని దర్శించుకున్న భక్తులు
- భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసిన శ్రీరామ్ వినాయక యూత్
- స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు బొగ్గు శ్రీను



కంచరపాలెం : త్రేతయుగంలో లోకకళ్యాణం కోసం అవతరించిన శ్రీ సీతారాములు చరిత్ర నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని జై భారత్ గ్రామ అధ్యక్షుడు బొగ్గ శ్రీను పేర్కొన్నారు.

బుధవారం శ్రీరామనవమి సందర్భంగా గ్రేటర్ విశాఖ 48 వ వార్డు బర్మా క్యాంప్ లో కొలువై ఉన్న శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో శ్రీ రామ నవమి వేడుకలు నిరాడంబరంగా జరిపించారు. ఆలయ ప్రధాన పురోహితులు వేమూరి వెంకట శ్రీరామమూర్తి వారి పర్యవేక్షణలో స్వామి వారి కళ్యాణం జరిపించారు.

ఈ వేడుకలు శ్రీరామ్ వినాయక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రస్తుతం రోజురోజుకూ విస్తరిస్తున్న కోవిడ్ పట్ల భక్తులకు అవగాహన కల్పిస్తూ సీతారామల కల్యాణం జరిపించారు. భక్తులు సామాజిక దూరం పాటిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు.

ఈ వేడుకలలో జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు బొగ్గ శ్రీను కుటుంబ సమేతంగా హాజరై స్వామివారి కళ్యాణాన్ని వీక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ఈ వేడుకలో శ్రీరామ్ వినాయక యూత్ సభ్యులు పిల్లి రాజు, పుక్కళ్ళ ప్రసాద్, గండిబోయిన నూకరాజు, దాసరి శ్రీనివాసరావు, పిల్లి గణేష్, టెక్కలి సన్యాసిరావు, తేలు ప్రసాద్, తేలు మూర్తి,ఉంగాటి శ్రీనివాసరావు, కే కనకరాజు,చొప్పా నరేష్ కుమార్, సూరాడ వాసు, రేస్ రాము, విజయవాడ శ్రీను, దీనబంధు, బొగ్గ శ్రీను మిత్రమండలి సభ్యులు, గణేష్, నవీన్ సాయి, రామ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# కోవిషీల్డ్ .. ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 600

పుణె: దేశంలో కరోనా ఉద్ధృతి నేపథ్యంలో వ్యాక్సినేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేలా కేంద్రం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. వ్యాక్సిన్ ఉత్పత్తిదారులు 50శాతం డోసులను నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలు, బహిరంగ మార్కెట్‌లో అమ్ముకునేందుకు వీలు కల్పించింది. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించిన సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా.. ప్రైవేటు మార్కెట్లో కొవిషీల్డ్ టీకాల ధరలను బుధవారం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక డోసుకు రూ. 400, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 600 చొప్పున టీకాను విక్రయిస్తామని వెల్లడించింది. "కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మా ఉత్పత్తిలో 50శాతం కేంద్రానికి, 50శాతం రాష్ట్రాలు, ప్రైవేటు ఆసుపత్రులకు అందజేయనున్నాం. రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక డోసుకు రూ. 400, ప్రైవేటు ఆసుపత్రులకు రూ. 600 చొప్పున విక్రయిస్తాం. విదేశీ టీకాలతో పోలిస్తే మా వ్యాక్సిన్ ధరలు అందుబాటులోనే ఉన్నాయి" అని సీరమ్ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. వచ్చే రెండు నెలల్లో టీకా ఉత్పత్తిని మరింత పెంచి కొరతను అధిగమిస్తామని సంస్థ ఈ సందర్భంగా పేర్కొంది. 4, 5 నెలల తర్వాత రిటైల్ మార్కెట్లోనూ అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది.

ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ఉత్పత్తిదారుల నుంచి వ్యాక్సిన్లను విక్రయించి రాష్ట్రాలకు పంపిణీ చేస్తోంది. అయితే ఈ విధానం వల్ల రాష్ట్రాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఇటీవల మోదీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. టీకా తయారీదారులు... 50% ఉత్పత్తిని నేరుగా రాష్ట్ర ప్రభుత్వాలకు సరఫరా చేయడానికి, నిర్ణీత ధరలకు బహిరంగ మార్కెట్లో విక్రయించుకోవడానికి కేంద్రం అంగీకరించింది. అదనపు డోసులు కావాలనుకుంటే రాష్ట్ర ప్రభుత్వాలు నేరుగా వ్యాక్సిన్ తయారీ సంస్థల నుంచి సేకరించుకునే స్వేచ్ఛ కల్పించింది.

# కవి సమయం

## స్నేహితుడు

నా స్నేహితుడు వరం
మూడ్ ఎప్పుడూ గరం గరం
గర్ల్‌ఫ్రెండ్‌తో ఆడుతుంటాడు సరసం
చదువంటే విరసం
నచ్చిన వంటకం పాయసం
ఎప్పుడూ చెప్పించుకుంటాడు జోస్యం
బలాదూర్ గా తిరగడం ఇష్టం
తెస్తాడు ఇంటికెంతో కష్టం
చేసిన ప్రతీ వ్యాపారంలో నష్టం
ఏ పనికి వుండకూడదు ఇష్టం

...కవితా రచన
సి.ప్రతాప్

# పంచాంగం

మాసం : చైత్ర; తిథి : దశమి రా.6.33; మఖ రా.3.31; వ.మ.3.31ల 5.07.

గురువారం 22 -04-2021

**మేషం :** దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహ కారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం.

**వృషభం :** నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు.

**మిథునం :** కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం.

**కర్కాటకం :** విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం.

**సింహం :** ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. కుటుంబీకుల మధ్య ఆసక్తిరకమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి.

**కన్య :** భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

**తుల :** మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం.

**వృశ్చికం :** నిరుద్యోగులకు బోగస్ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం. సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఒక ప్రకటన మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది.

**ధనుస్సు :** నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. కొత్త ఆదాయ మార్గాలు అన్వేషిస్తారు. విలువైన వస్తువులపై దృష్టి సారిస్తారు. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు.

**మకరం :** దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభా కాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం.

**కుంభం :** ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగుమతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసివస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

**మీనం :** పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.

# పోలీసుల సహాయంతో
# దౌర్జన్యానికి వచ్చిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

## లక్కోజు కృష్ణ మరియు వారి కుటుంబ సభ్యులు



విశాఖపట్నం : పోలీసుల సహాయంతో తమ మీదికి దౌర్జన్యానికి వచ్చిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని నర్సీపట్నం పెద్ద బొడ్డేపల్లికి చెందిన లక్కోజు కృష్ణ మరియు వారి కుటుంబ సభ్యులు కోరారు. బుధవారం విశాఖ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో లక్కోజు కృష్ణ మాట్లాడుతూ తన చిన్నాన్న పిల్లలైన లక్కోజు బ్రహ్మలింగం, జానకిరామయ్య, శొంట్యాన త్రివేణి తదితరులు మాటిమాటికీ ఆస్తికోసం తన తండ్రి లక్కోజు సత్యాన్ని వేధింపులకు గురిచేసే వారన్నారు. ఉరిపెద్ద మనుష్యల వద్ద అనేకసార్లు పంచాయితీ జరిగిందని కోర్ట్ లో తేల్చుకొమ్మని పెద్దలు చెప్పారన్నారు.1998 లో పిల్లల చదువులు,కుటుంబావసరాల నిమిత్తం ఊరి పెద్దల సమక్షంలో అమ్మిన ఆస్తిపై ఇప్పుడు మాకు హక్కులు ఉన్నాయంటూ తమను బెదిరిస్తున్నారని ఆరోపించారు.లక్కోజు బ్రహ్మ లింగం, జానకి, శొంట్యాన త్రివేణి,వారి కుటుంబసభ్యుల వేధింపులు భరించలేకే తన తండ్రి మరణించాడని ఆవేదన వ్యక్తం చేసారు.న్యాయం చెయ్యవలసిన పోలీసులు మిత్రుడనే ఆపేక్ష కొన్నిరకాల ప్రలోభాలకు లొంగి వైరి వర్గాలకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు.తండ్రి పోయిన బాదలో ఉన్న మాకు లక్కోజు అప్పలరాజు కుమారులైన బ్రహ్మలింగం, జానకిరామయ్య తదితరులనుంచి ప్రాణభయం ఉందన్నారు.తన తల్లి ఒక్కటే ఇంట్లో ఉండగా వారందరూ ఏకమై నానా దుర్భాషలాడుతూ గునపాలు సుత్తులతో వచ్చి తమ ఇంటిని ధ్వంసం చేసారని వాపోయారు. అడ్డువచ్చిన తన తల్లిని చంపడానికి కూడా ప్రయత్నించారని కన్నీటి పర్యంతమయ్యారు.ప్రొక్లైనర్ తో ఇంటి గేటును,గోడలను ధ్వంసం చేశారన్నారు. అడ్డువచ్చిన వారిని చంపి ఆస్తిని స్వాధీనపరుచుకుంటామని తమను బెదిరించారన్నారు. తమవెనుక పోలీసులు, రాజకీయ నాయకులు ఉన్నారని తమను ఏమి చెయ్యలేరని లక్కోజు బ్రహ్మలింగం, లాక్కోజు జానకీరామయ్యలు హెచ్చరించారన్నారు. ఫిర్యాదు ఇవ్వడానికి పొలిసు స్టేషనుకు వెళితే తరువాతరమ్మని పొలిసు స్టేషన్లో చెప్పారన్నారు.తిరిగి ఇంటికి వచ్చేసరికే తమ ఇంటిని పూర్తిగా ధ్వంసం చేసేసారని విలపించారు అదేరోజు సాయంత్రం పొలిసు ఎస్ఐ,సీఐ లను కలిసి పిర్యాదు ఇవ్వబోగా తిరస్కరించి తమ మీద గతంలో పెట్టిన కేసులో సాల్వెన్సీ తీసుకురావాలని తిప్పి పంపించేశారని ఆరోపించారు.పోలీసు ఎస్ఐ,సీఐ లు ఎటువంటి విచారణ జరుపకుండా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు, బాధితులమైన తమమీదే సదరు పొలిసు ఎస్ఐ,సీఐ లు క్రైమ్ కేసు లు పెడతామని బెదిరిస్తున్నారన్నారు.తమ ఇంటిని ఇప్పటికే ధ్వంసం చేసారని తమ కుటుంబ సభ్యులకు సదరు పొలిసు ఎస్ఐ,సీఐ మరియు లక్కోజు బ్రహ్మలింగం, లక్కోజు జానకిరామయ్య,శొంథ్యన త్రివేణి,వివేక్,రవి,బ్రహ్మాజీ తదితరుల నుంచి ప్రాణహాని ఉందని భయాందోళనలు వ్యక్తం చేసారు.న్యాయవాది శ్రీ లక్ష్మి మాట్లాడుతూ న్యాయం చెయ్యవలసిన పోలీసులు కొన్ని రకాల వత్తిడులకు లొంగి బాధితులను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఫిర్యాదు తీసుకోకుండా సాక్ష్యాదారాలు పరిశీలించకుండా మరుసటి రోజు కేస్ రిజిస్టర్ చేశారన్నారు.ఎందుకు చెయ్యలేదని న్యాయవాదిగా ప్రశ్నిస్తే సి ఐ సింహాద్రి నాయుడు వాళ్ల ఇల్లు వల్లే పగల గొట్టుకొన్నారని వ్యంగంగా సమాధానం ఇచ్చారని తెలిపారు. రిజిస్టర్ చేసిన కేస్ లో మర్డర్ ప్రయత్నం కింద 307 సెక్షన్ నమోదు చేయలేదని న్యాయవాది శ్రీలక్ష్మి ఆరోపించారు.ఈ విషయం పై ఇప్పటికే జిల్లా ఎస్ పీ కు కూడా పిర్యాదు చేశామని తెలిపారు.

అనేక అకృత్యాలు చేసున్న పోలీసుల పై న్యాయపరంగా పోరాటం చేస్తామని తెలిపారు సంబంధిత ఫోటోలు,వీడియోలను మీడియా సమావేశంలో ప్రదర్శించారు.ఈ సమావేశంలో లక్కోజు కృష్ణ,లక్కోజు కాంత, సతీష్, చంటి, సునీత, వరలక్ష్మి, నగేష్, నిర్మల, దుర్గాప్రసాద్ లు పాల్గొన్నారు.

# పరవాడలో
# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



పరవాడ : మండలకేంద్రమైన పరవాడలో శ్రీరామనవమి వేడుకులు ఘనంగా జరిగాయి. భక్తులు వేకువజామునుండే కోవిడ్ నిభంధనలు పాటిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. ముందుగా వైసిపీ సెంట్రల్ ఎగ్జిక్యూటీవ్ మెంబర్ పైలశ్రీనువాసురావు, పరవాడ సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, వైసీపీ జిల్లా ప్రదాన కార్యదర్శి చుక్కరామునాయుడు, వైస్ సర్పంచ్ బండారు రామారావు తదితరులు దర్శించుకోని ప్రత్యేక పూజలు చేశారు.

ప్రతి ఒక్కరు భౌతికదూరం పాటిస్తూ మాస్కులు దరించి శ్రీరామునివారిని దర్శించుకోవాలి అని కోరారు. అనంతరము అందరికీ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గాంధీ బొమ్మ వద్ద గీతాభవన్ ప్రక్కన ఉన్న రామాలయంలో శ్రీరామనవమి శుభ సందర్భంగా గోడి నరసింహ చారి, సతీమణి గోడి విజయలక్ష్మి సీతారాములవారి కళ్యాణం లో భాగస్వామ్యులయి విశేష పూజలు గావించారు. అలాగే తాళాబత్తుల మూర్తి సతీసమేతంగా, అలాగే మజ్జి త్రినాథరావు సతీసమేతంగా, ఆ సీతారాములవారి కళ్యాణం కార్యక్రమంలో భాగస్వామ్యులయి, విశేష పూజలు గావించి ముప్పై ఎనిమిదో వార్డు తెలుగుదేశం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం 31వ వార్డు కృష్ణ గార్డెన్స్ శ్రీ రామాలయం ఆలయంలో 31వ వార్డు వైసిపి నాయకులు దొడ్డి బాపు ఆనంద్ రామాలయానికి విచ్చేసి శ్రీ సీతారాముల కళ్యాణం లో పాలుపంచుకుని స్వామి వారిని దర్శించుకున్నారు. అదేవిధంగా కనకల వీధిలో ఏర్పాటుచేసిన సీతారాముల పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దొడ్డి బాపు ఆనంద్ మాట్లాడుతూ వార్డు ప్రజలు సుఖశాంతులను ఆరోగ్యాన్ని అందించాలని స్వామి వారిని ప్రార్థించారు.

# వదంతుల ఖండన

పెద్దాపురం : వాట్సాప్ గ్రూపులలో తూర్పు గోదావరి జిల్లాలో లాక్ డౌన్ అమలు చేయనున్నారని వందంతులను సర్క్యులేట్ చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్న ఆకతాయి వ్యక్తులపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తూర్పు గోదావరి జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుండి మరోసారి లాక్ డౌన్ అమలు చేస్తామని ప్రకటించారని వాట్సాప్ గ్రూపులలో సర్క్యులేట్ అవుతున్న వార్త పూర్తిగా అసత్యమని ఆయన ఖండించారు. అటు వంటి సమావేశం ఏదీ మంగళవారం జరగలేదని, లాక్ డౌన్ విధించబోతున్నట్లు ఎటువంటి ప్రకటన చేయలేదని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. లాక్ డౌన్ గురించి సామాజిక మాధ్యమాల్లో కనిపిస్తున్న వదంతులను నమ్మవద్దని, ఆందోళనకు గురికావద్దని జిల్లా కలెక్టర్ మురళీధరెడ్డి ప్రజలను కోరారు. అసత్య వార్తలను సృష్టించి, సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని, చట్టపరమైన కఠిన చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

# పెద్దాపురంలో విశ్రాంత అగ్నిమాపక ఉద్యోగులకు సన్మానం



పెద్దాపురం : అగ్నిమాపక వారోత్సవాలలో చివరి రోజున ముఖ్య అతిథిగా మాన్యులు పెద్దాపురం డిఎస్పి అరిటాకుల శ్రీనివాసరావు విచ్చేసినారు.

ఈ కార్యక్రమంలో పెద్దాపురం లో స్థిరపడ్డ విశ్రాంత అగ్నిమాపక ఉద్యోగులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథితో పాటుగా పలువురు ఎంతో విలువైన సలహాలు అందించన అనంతరం ఈ వారోత్సవాలు ముగిశాయి.

# ఏజెన్సీలో ఇటుకల పండగ



అరకులోయ : ప్రతి ఏడాది సాంప్రదాయబద్ధంగా గిరిజనులు ఇటుకల పండగ జరుపుకుంటారు ఈ పండుగను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో గిరి మహిళలు రోడ్లలో కఱ్రలు. రాళ్ల. రహదారికి అడ్డుగా గేట్లు వేసుకొని గిరిజన సాంప్రదాయ బద్ధంగా రాకపోకలు సాగిస్తున్నారు వాహన చోదకుల దగ్గరనుంచి పజోర్ సరదాగా వసూలు చేస్తున్నారు సరదాగా చిల్లర చంద ఇవ్వనివాహన చోదకులకు వారిపై రంగులు పూసి నీళ్లు పోసి పంపుతున్నారు ఏజెన్సీ వ్యాప్తంగా ఆచారం గా ఈ పండగ ప్రారంభమైంది.

# నేటి నుంచి భీమిలి, తగరపువలసలో కోవిడ్ సెకెండ్ డోస్

భీమునిపట్నం : నేటినుంచి భీమునిపట్నం కమ్యూనిటి హెల్త్ సెంటర్, తాళ్ళవలస హెల్త్ సెంటర్, భీమునిపట్నం చిన్న బజార్, తగరపు వలస మార్క్స్ సెంటర్ లందు కోవిడ్ సెకెండ్ డోస్ వేయనున్నట్లు భీమునిపట్నం తహశీల్దార్ వెంకట ఈశ్వర్రావు తెలిపారు.

స్థానిక విలేకరు లతో ఆయన మాట్లాడుతూ పస్ట్ డోస్ వేసుకున్న వారు ఫ్రంట్ లైన్ వర్కర్స్, హెల్త్ వర్కర్స్, ఇంతకుముందు వేసుకుని రెండవ డోస్ కోసం వెయిట్ చేస్తున్న 45ఏళ్ళు దాటిన వాళ్ళకు...

అంతేకాకుండా 60ఏళ్ళు ఉన్న రిస్క్ జోన్ వాళ్ళకు కూడా సెకండ్ డోస్ వేయ నున్నట్లు ఆయన తెలిపారు.





శ్రీరామచంద్రమూర్తిని దర్శించుకున్న అరకు ఎమ్మెల్యే

# ఘనంగా సీతారాముల కళ్యాణం



శ్రీరామనవమి నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యూరు : రాజేంద్రపాలెం గ్రామంలో సీతారాముల కళ్యాణం ఘనంగా ఆలయ కమిటీ నిర్వహించారు. సీతారాముల కల్యాణానికి తిలకించడానికి అప్పలరాజు కుటుంబ సభ్యులతో పూజలు చేయించుకున్నారు. ఇందులో భాగంగా గ్రామస్తులు ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు వేదపండితులు కృష్ణశాస్త్రి భక్తులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ భోజన వసతి కల్పించారు. జైశ్రీరామ్ జైశ్రీరామ్ అంటూ పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పీఠ సింహాచలం, బషీర్‌ఖాన్, కాకర చిన్నారావు, కాకర గంగరాజు, రాము, అన్నవరం, బాలరాజు, దిబ్బ సత్తిబాబు, రమేష్, దుర్గ, కాకర ఉష, అంబటి నూకలు, రత్నంతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

# 32వ వార్డు సమస్యలపై
# జివియంసి కమిషనర్‌కు వినతిపత్రం అందజేత



విశాఖపట్నం : జీవీఎంసీ 32 వ వార్డు సమస్యలపై బుధ వారం కమిషనర్ ను కలిసి చర్చించినట్లు కార్పొరేటర్ కందుల నాగరాజు తెలిపారు. దీర్ఘకాలికంగా వార్డులో ఎన్నో సమస్యలున్నాయని అన్నిటినీ పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. వేసవికాలం కారణంగా నీటి సమస్యలు తలెత్తకుండా, తగిన చర్యలు తీసుకోవాలని, అలాగే వార్డ్ పరిధిలో కల మంచినీటి బావుల్లో కూడా పూడిక తీయించాలని కోరినట్లు తెలిపారు. డ్రైనేజీ సమస్యలు,రహదారులు అన్నిటిని మరమ్మత్తులు చేయించాలని కోరారు. కరోనా మహమ్మారి విజృంభిస్తోన్న కారణంగా వార్డు లోని అర్హులైన వారందరికీ వాక్సిన్ వేయించేలా ఏర్పాటుచేయాలని కోరారు. చెత్త లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రంచేయించాలని నాగరాజు కోరారు.ఈ మేరకు కమిషనర్ సృజనకు నాగరాజు ఒక వినతి పత్రం సమర్పించారు.

## భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులుకి శుభాకాంక్షలు తెలిపిన
# భీమిలి సెంటీనియల్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ సత్తరవు వాయునందనరావు

భీమునిపట్నం : బుధవారం నాడు భీమిలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు గా నియమితులైన ఎన్ జనార్దన్ రావు ని భీమిలి సెంటీనియల్ లైన్స్ క్లబ్ అధ్యక్షుడు లయన్ డాక్టర్ సత్తరవు వాయునందనరావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు,ఈ కార్యక్రమంలో బి జే పి పల్లా భరత్ కుమార్, కె శ్రీనివాసరావు మరియు జనసేన భీమునిపట్నం నాయకులు వాసుపల్లి అనిల్ కుమార్ పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# నేడు కోవిడ్‌పై సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు శిక్షణ

గొలుగొండ : ఈ నెల 22న కోవిడ్ 19పై గొలుగొండ మండలం పరిధిలో గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచ్‌లకు గొలుగొండ మండలం పరిషత్ కార్యాలయంలో సమావేశం శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గొలుగొండ ఎంపిడిఓ డేవిడ్‌రాజు తెలిపారు.

కావున...

గురువారం ఉదయం 10 గంటలకు జరుగు కోవిడ్ 19 శిక్షణ సమావేశము అందరూ హాజరు కావాలని తెలిపారు.

# శ్రీరామనవమి ప్రత్యేకత



పాడేరు : ఏప్రిల్ 21 రాముడిని ఆదర్శంగా తీసుకోవడం అంటే ఆరాధన కోసం కాదు. మన జీవితాలను మనమే ఉద్ధరించుకోవాలన్నది అందులోని పరమార్థం. త్యాగం, ధర్మం, దయ, పరాక్రమం రామునిలోని గొప్ప లక్షణాలు. వీటిని పెంపొందించుకోవాలని చెప్పేదే రామాయణం

శ్రీ రాముడులో ఏమంత గొప్పదనం ఉంది?

మాయలు మంత్రాలు చూపించలేదు.

తన విశ్వరూపం ప్రకటించలేదు.

జీవితంలో ఎన్నో కష్టాలు...జరగరాని సంఘటనలు...

చిన్న వయసులోనే పినతల్లి స్వార్థానికి తండ్రిని పోగొట్టుకున్నాడు...

పట్టాభిషేక ముహూర్తానికే అడవుల బాట పట్టాడు...

తోడుగా, ఊరటగా నిలుస్తుందనుకున్న భార్యకు దూరమయ్యాడు...

కారడవుల్లో కన్నీళ్లతో వెతికాడు...

అంతులేని దుఃఖాన్ని గుండెల్లో మోస్తూనే రాక్షస వధ చేశాడు...

అందరిలాగే ఉద్వేగాలు, ఆలోచనలు, ఆవేదనలు అనుభవించాడు.లి

లోకమంతా తనను దేవుడని కీర్తిస్తున్నా తాను మాత్రం విస్పష్టంగా అహం దశరథాత్మజః - దశరథుని కుమారుడైన రాముడిని మాత్రమే' అని ప్రకటించాడు.

అయినా లోకమంతా ఆయననే ఎందుకు ఆదర్శంగా తీసుకుంది?

ఆయన ధర్మాన్ని సంపూర్ణంగా ఆచరించాడు. ధర్మానికి రూపునిస్తే రాముడి రూపం వస్తుందన్నంత పవిత్రంగా జీవించాడు. చేతికి అందివచ్చిన సింహాసనం దక్కక పోయినా, స్వయంగా భరతుడే వచ్చి రాజ్యానికి రమ్మని అడిగినా, ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన సీతను రావణుడు అపహరించినా, సందర్భమేదైనా కానీ.. ధర్మాన్ని విడిచిపెట్టలేదు. అందుకే రామయ్య ధర్మమూర్తి అయ్యాడు. లోకానికి ఒకేఒక్కడుగా నిలిచాడు.

**శాస్త్ర ధర్మం** : తండ్రి మాట కోసం వనవాసానికి సీత, లక్ష్మణులతో కలిసి బయలుదేరాడు శ్రీరామచంద్రుడు. అయోధ్యలో పుత్రవియోగ దుఃఖంతో దశరథుడు మరణించారు. మేనమామ ఇంట్లో ఉన్న భరతుడు వచ్చి దశరథుడికి అంత్యక్రియలు పూర్తి చేశాడు. అన్నను వెతుక్కుంటూ అరణ్యానికి వెళ్లి, తండ్రి మరణవార్త తెలియజేశాడు. దీంతో ఒక్కసారిగా కుప్పకూలిపోతాడు రామయ్య. పెద్దకుమారుడినైనా తండ్రికి ఉత్తరక్రియలు చెయ్యలేకపోయానని బాధపడతాడు. అక్కడికక్కడే శాస్త్రబద్ధంగా తండ్రి రూపానికి ఉత్తరక్రియలు చేసి, పిండితో పిండాలు చేసి, దర్భల మీద ఉంచబోయాడు. ఇంతలో బంగారు కంకణాలు ధరించిన ఓ హస్తం రాముడి ముందుకు వచ్చింది. తాను దశరథుడినని, పిండం తన చేతిలో పెట్టమని వాణి వినిపించింది. కానీ, రాముడు ఇందుకు ఒప్పుకోడు. శాస్త్రప్రమాణాలు అనుసరించి, దర్భల మీదే పిండాలు ఉంచుతాడు. నిజంగా నీవు దశరథుడవే అయితే, దర్భల మీద ఉంచిన పిండాలు స్వీకరించు. నేను మాత్రం శాస్త్ర ప్రమాణాన్ని పాటిస్తానని నిక్కచ్చిగా చెప్పాడు. తండ్రి వియోగ దుఃఖంలో ఉన్నసమయంలో కూడా శాస్త్రధర్మాన్ని తు.చ తప్పకుండా పాటించిన ఆదర్శమూర్తి రామచంద్రమూర్తి ఒక్కడే.

**స్నేహ ధర్మం** : మాయలేడి కారణంగా సీతమ్మను వదలి, పర్ణశాలను దాటి చాలా దూరం వస్తారు రామలక్ష్మణులు. ఇదే అదనుగా భావించిన రావణుడు మారు వేషంలో వచ్చి సీతమ్మను అపహరిస్తాడు. ఇదంతా గమనించిన జటాయువు రావణుడిని అడ్డగిస్తాడు. విశాలమైన తన రెక్కలే ఆయుధంగా చేసుకుని, రావణుడిని ముప్పుతిప్పలు పెడతాడు. సహనం నశించిన రావణాసురుడు జటాయువు రెక్కలు నరికివేస్తాడు. రెక్కలు తెగిన ఆ పక్షిరాజు నేలకూలుతాడు. కొన్నాళ్లకు సీతాన్వేషణ చేస్తూ అటుగా వచ్చిన రాముడికి జరిగిన వృత్తాంతం పూర్తిగా చెప్పి, రాముడి చేతిలోనే ప్రాణం విడుస్తాడు. తనకు క్షేమం కలిగించటానికి ప్రాణాలకు తెగించిన జటాయువును ఆప్తమిత్రుడుగా స్వీకరించి, అతడికి ఉత్తరక్రియలు స్వయంగా నిర్వహిస్తాడు రామయ్య. తాను క్షత్రియుడు. చేస్తున్నది వనవాసం. మరణించింది పక్షి. అయినప్పటికీ జటాయువుకు తాను స్వయంగా ఉత్తరక్రియలు చేసి, స్నేహధర్మానికి అసలైన అర్థాన్ని ఆచరణాత్మకంగా ప్రకటించాడా మహనీయుడు.

**యుద్ధ ధర్మం** : వాలి తన తమ్ముడైన సుగ్రీవుడి భార్య రుమను చెరబట్టాడు. తమ్ముడి భార్య కోడలితో సమానం. మామగారు తండ్రితో సమానం. తండ్రిలాగా కాపాడాల్సిన తమ్ముడి భార్యను కామంతో వాలి కోరుకున్నాడు. అంతేకాదు.. వాలి వనచరుడు. క్రూరత్వం కలిగిన వనచరాలను వేటాడటం క్షత్రియధర్మం. అంతేకాదు, ఎదుటివారి బలాన్ని తగ్గించే వరమాల వాలి మెడలో ఉంటుంది. దాన్ని ధరించిన సమయంలో వాలి ఎదుట ఎవరు నిలిచినా వారి శక్తి క్షీణిస్తుంది. కాబట్టే రాముడు చెట్టుచాటున దాగి, వాలిపై బాణాన్ని ప్రయోగించాడు. ఇది యుద్ధధర్మం. వాలి వధ ఘట్టంలో రాముడు క్షత్రియ, యుద్ధ ధర్మాలను పాటించాడు.

రావణ సంహారం తర్వాత విభీషణుడు రాముని వద్దకు వచ్చి, ఉత్తర క్రియలు నిర్వహించేందుకు అన్నగారి పార్థివ దేహాన్ని ఇమ్మని అడుగుతాడు. అప్పుడు రామచంద్రుడు

మరణాంతారం వైరాని నివృత్తం నః ప్రయోజనం ఎ క్రియతామద్య సంస్కారః మమాప్యేష యథా తవ

'విభీషణా! శతృత్వం ఎంతటిదైనా అది చావుతో ముగిసిపోతుంది. సంధి కుదరకపోవడం వల్ల యుద్ధం చేయాల్సి వచ్చింది. మీ అన్నగారికి ఆచార విధి ప్రకారం ఉత్తర క్రియలు జరిపించు. ఇక నుంచి ఈయన నీకు మాత్రమే కాదు. నాకూ అన్నగారే' అంటాడు... ఇదీ రాముడి ధర్మవర్తన.



**దయా ధర్మం** : సీతను రాముడికి అప్పగించమని హితబోధ చేసిన విభీషణుడికి రాజ్యబహిష్కరణ శిక్ష వేస్తాడు రావణుడు. సముద్రతీరంలో అపారమైన వానరసేనతో ఉన్న రామచంద్రుడి పాదాలను ఆశ్రయిస్తాడు విభీషణుడు. మరో ఆలోచన లేకుండా విభీషణుడికి అభయం ఇస్తాడు రామయ్య. అంతేకాదు, రావణుడిని చంపి విభీషణుడిని లంకారాజ్యానికి రాజును చేస్తానని ప్రతిజ్ఞ చేస్తాడు. కానీ, సుగ్రీవుడు మొదలైన వారికి ఇదంతా ఇష్టం లేదు. ఏకాంతంలో ఉన్న రామయ్య దగ్గరకు వెళ్లి, విభీషణుడిని నమ్మవద్దని చెబుతారు. అతడు రావణాసురుడి దూత అంటూ హెచ్చరిస్తారు. అంతా విన్న రాముడు విభీషణుడే కాదు... చివరకు రావణుడే తనను ఆశ్రయించినా.. అతడికి కూడా అభయం ఇస్తానంటాడు. ఆశ్రయించిన ప్రాణులకు రక్షణ కల్పించటం క్షత్రియధర్మం. దయాధర్మం కూడా. వనవాసంలో ఉన్నా, చివరకు యుద్ధభూమిలో ఉన్నా దయాధర్మాన్ని రామయ్య విడిచిపెట్టలేదు.

**మనుష్య ధర్మం** : రామరావణ సంగ్రామం ముగుస్తుంది. రావణుడు నేలకు ఒరుగుతాడు. ముల్లోకాలూ ఎంతో ఆనందిస్తాయి. వానరసేన చేస్తున్న సందడి అంతా ఇంతా కాదు. ఇంతలో బ్రహ్మాది దేవతలు ప్రత్యక్షమవుతారు. రాముడిని సాక్షాత్తు శ్రీమహావిష్ణు స్వరూపంగా స్తుతిస్తారు. 'నీది విష్ణు అంశ. వాస్తవానికి నువ్వు నిరాకారుడివి. అయినా సాకారుడిగా ఉన్నావు. సృష్టి, స్థితి, లయలు నీవే నిర్వహిస్తావు...' అంటూ రాముడికి దైవత్వాన్ని ఆపాదిస్తారు. బ్రహ్మదేవుడే స్వయంగా వచ్చి చెప్పినా రాముడు తాను దైవాన్నని చెప్పుకోలేదు. తనకు దైవత్వాన్ని ఆపాదించుకోలేదు.

'ఆత్మానం మానుషం మన్యే... దశరథాత్మజః' : అంటూ తాను కేవలం దశరథుని కుమారుడైన రాముడిని మాత్రమే. సాధారణ వ్యక్తిని మాత్రమే' అంటాడు. ఇదీ రామయ్య పాటించిన మనుష్యధర్మం. రామయ్య ఎక్కడా మాయలు, మంత్రాలు ప్రకటించలేదు. తాను దైవాన్నని చెప్పుకోలేదు. సాధారణ పౌరుడిలాగే రాజ్యభోగాలతో పాటు సుఖదుఃఖాలూ అనుభవించాడు. మనుష్యధర్మాన్ని పరిపూర్ణంగా పాటించిన అవతారమూర్తి శ్రీరాముడు.

**సోదర ధర్మం** : రావణ వధ జరిగింది. లంకలో ఉన్న సీతాదేవిని తీసుకురావలసిందిగా విభీషణుడుకి వర్తమానం పంపించి, విశ్రాంతిగా కూర్చున్నాడు రామయ్య. దూరంగా ఓ స్త్రీమూర్తి వడివడిగా అడుగులు వేసుకుంటూ తన వైపే వస్తోంది. ఆమె ఎవరై ఉంటుంది? రాముడి ఆలోచన సాగుతుండగానే ఆమె ఎదురుగా వచ్చి నిలుచుంది. అమ్మా! నీవెవరు? ఎందుకిలా వచ్చావు? రక్తసిక్తమైన రణభూమిని చూస్తుంటే నీకు భయంగా అనిపించటం లేదా? నా వల్ల ఏదైనా సాయం కావాలా? అంటూ రామయ్య ఎంతో వినమ్రంగా ఆమెను అడిగాడు. అందుకామె సమాధానం ఇస్తూ, రామచంద్రమూర్తీ! నన్ను మండోదరి అంటారు. నీ చేతిలో మరణించిన రావణాసురుడి భార్యను. రామా! నీవు ధర్మమూర్తివనీ, ఏకపత్నీవ్రతుడవనీ, సీతను తప్ప మరే ఇతర స్త్రీ పేరు కూడా తలచవనీ విన్నాను. నా భర్త అనేకమంది స్త్రీలను చెరపట్టాడు. నీవంటి ఉత్తమ గుణసంపన్నుడైన యోధుడిని చూడాలనే కుతూహలంతో వచ్చాను. పరస్త్రీని చూడగానే వినమ్రంగా ఉన్నప్పుడే నీ ఔన్నత్యం అర్థమైంది.

రామా! ధన్యురాలను. ఇక సెలవు. అంటూ నిష్క్రమించింది. ఇదీ.. పరస్త్రీల పై రామయ్య చూపించే సోదరధర్మం.

పవిత్ర జీవితం కోసం, ముక్తి కోసం సాధన చేసే యోగులు రామునిలా జీవించాలని అనుకుంటారు. చుట్టూ ఉన్న పరిస్థితులు ఎప్పుడైనా మారొచ్చు. ఎలాగైనా ఉండొచ్చు. నిరీక్షించి.. కాలపరీక్షను ఎదుర్కోవడం వివేకవంతుల లక్షణం.

రాముడూ అదే చేశాడు. ఎప్పుడూ ప్రణాళిక బద్ధంగానే జీవితం నడుస్తుందని భావించలేం. మన ప్రమేయం లేకుండా చికాకులు కలుగుతాయి. వాటికి కుంగిపోతే జీవితం గతి తప్పుతుంది. గుచ్చుకున్న ముల్లును నెమ్మదిగా తొలగించి ముందుకెళ్లాలి. అలా చేయగలిగితే అద్భుతమైన అనుభూతి మిగులుతుంది. ఏ విషయాన్నైనా సక్రమంగా నిర్వర్తించే సామర్థ్యం పెరుగుతుంది. **జై శ్రీరామ్ జై శ్రీరామ్**

## నిరుపేదలకు ప్రభుత్వమే వైద్యం చేయించే పథకం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ



గుడివాడ : ఆస్థులు అమ్ముకునే అవసరం లేకుండా నిరుపేదలు, నిస్సహాయులకు కూడా ప్రభుత్వమే ఖర్చులన్నీ భరించి వైద్యం చేయించే పథకం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు ( నాని ) అన్నారు. గుడివాడ పట్టణం బైపాస్ రోడ్డులో మంత్రి కొడాలి నానిని వైసీపీ నందివాడ మండల అధ్యక్షుడు పెయ్యల ఆదాం, గుడివాడ వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఉపాధ్యక్షుడు తోట నాగరాజు, వైసీపీ నాయకులు దేశిరెడ్డి రామ్మోహనరెడ్డి, దుంపల శ్రీను, నెరుసు శ్రీను తదితరులు కలిశారు. ఈ సందర్భంగా పెయ్యల ఆదాం మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గ పరిధిలోని మండల కేంద్రమైన నందివాడకు చెందిన రాజులపాటి చంద్రశేఖర్ అనారోగ్య సమస్యతో బాధపడుతున్నాడని చెప్పారు. విజయవాడలోని అను ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటున్నాడని, కాలుకు శస్త్రచికిత్స చేయాలని వైద్యులు చెప్పారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రాజులపాటి చంద్రశేఖర్‌కు వైద్యం అందేలా చూడాలని పెయ్యల ఆదాం కోరారు. అనంతరం మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న రాజులపాటి చంద్రశేఖర్ కు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం అందేలా చూస్తానని చెప్పారు. వైద్యానికయ్యే ఖర్చులకు సంబంధించి ఆసుపత్రి ద్వారా ఎస్టిమేషన్ ను తీసుకురావాలని సూచించారు. ఇదిలా ఉండగా వైద్యరంగంలోనూ నాడు - నేడు కార్యక్రమాలను సీఎం జగన్మోహనరెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని, వీటికి నిధుల కొరత లేకుండా అవసరమైన చర్యలు తీసుకుంటు న్నారన్నారు. కార్పోరేట్ ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాలు, నిర్వహణ, శుభ్రత విషయంలో పాటిస్తున్న ప్రమాణాలన్నీ ప్రభుత్వాసుపత్రుల్లో ఉండేలా కృషి చేస్తున్నారన్నారని చెప్పారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నా మన్నారు. నెట్వర్క్ ఆసుపత్రిలన్నింటిలో ఆరోగ్యమిత్రలతో హెల్ప్ డెస్కును ఏర్పాటు చేశామన్నారు.

ఈ డెస్కును మరింత మెరుగుపర్చడం ద్వారా రోగులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందేలా చూస్తున్నామన్నారు. అనారోగ్య పరిస్థితులు తలెత్తినపుడు ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్స అందించే ఆసుపత్రులపై అవగాహన కల్పించడం, రిఫరల్ సేవలు ఎక్కడున్నాయన్న దానిపై కూడా విస్తృతమైన ప్రచారం చేయాలని సీఎం జగన్మోహనరెడ్డి అధికారులను ఆదేశించారన్నారు. ఆరోగ్యశ్రీ పథకం అమలు తీరును కూడా సీఎం జగన్మోహనరెడ్డి ఎప్పటికపుడు సమీక్షిస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, ఆరోగ్య అవసరాలను పరిశీలిస్తున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్ లో లేకుండా చర్యలు తీసుకుంటున్నారన్నారు. సీఎం జగన్మోహనరెడ్డి ఆదేశాల ప్రకారం వైద్యఖర్చు రూ.వెయ్యి దాటితే 2,436 ప్రొసీజర్లకు ఆరోగ్యశ్రీ కింద చికిత్స అందిస్తున్నారని మంత్రి కొడాలి నాని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అడపా బాబ్జి, వైసీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు మండలి హనుమంతరావు, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## పిచ్చుకవారి ఇంట సీతమ్మ రాముల వారి 103 వ కళ్యాణ మహోత్సవం

*- మూడు తరాలుగా జరుగుతున్న తంతు..*

*- లోక కళ్యాణార్థం శోభాయమానంగా సీతారాములవారి కళ్యాణం, పట్టాభిషేకం*





కాకినాడ : శ్రీ రామనవమి పురస్కరించుకొని 103వ సీతారామ కళ్యాణం శ్రీ పిచ్చుక వీర నాగేశ్వరరావు, భానుమతి దంపతులు స్థానిక ఆంజనేయ నగర్ లోని తమ స్వగృహంలో ఘనంగా జరిపించారు. లోక కళ్యాణార్థం సుమారు పది దశాబ్దాల క్రితం వీర నాగేశ్వరావు తాతగారైన శ్రీ నాగేశ్వరరావు, సురమ్మ దంపతులు సీతారాములవారి కళ్యాణం వేడుకలు శ్రీరామనవమి నాడు ప్రారంభస్తే, వారి తదనంతరం, శ్రీ వీర నాగేశ్వరావు గారి తల్లి తండ్రులు శ్రీ వీర్రాజు, పద్మావతి దంపతులు ప్రతి సంవత్సరం సీతారాములవారి కళ్యాణాన్ని కుటుంబ సంప్రదాయంగా కొనసాగిస్తూ వచ్చారు. అనంతరం తండ్రి శ్రీ వీర్రాజు 1987 సంవత్సరంలో మరణించగా నాటి నుంచి నేటి వరకు శ్రీ పిచ్చుక వీర నాగేశ్వరావు భానుమతి దంపతులు ప్రతి ఏటా సీత రాములవారి కల్యాణాన్ని కొనసాగిస్తూ వచ్చారు. కాగా శ్రీ నాగేశ్వరావు పష్కర కాలం శ్రమించి శ్రీ రామ కోటి పూర్తి చేసి భద్రాద్రి రాములవారి అంకితం ఇవ్వడం జరిగింది. అయితే ప్రతి సంవత్సరం భద్రాద్రి రాములవారి కల్యాణ ముహూర్తానికి వేడుకలు జరిపించే ఆనవాయితీలో భాగంగా ప్రకారం ఈ ప్లవనామ సంవత్సరంలో ఈ పిచ్చుక కుటుంభీకులు సీతారాములవారి కళ్యాణం, పట్టాభిషేకం చేయించి ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

## మణిభూషణ్ 'ప్రాణనిధి' కరోనా పై పోరాటం లఘు చిత్రం విడుదల

విశాఖపట్నం : నగరానికి చెందిన రాబ్ ఫిలింస్ ఇంటర్నేషనల్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన చిత్రం ప్రముఖ దర్శకుడు, జాతీయు స్థాయి మరియు నంది అవార్డు గ్రహీత మణి భూషణ్ రచన, దర్శకత్వం లో కరోనా విలయతాండవం నేపథ్యంగా 3 నిమిషాల నిడివి గల ఒక అద్భుత కళాచిత్రం శ్రీ రామనవమి సందర్భంగా టీవీ టూరిజం ఆఫీసియల్ ఛానల్ లో రాబ్ గ్రూప్ ఇండియా అధినేత హీరో ఆదిత్య భూషణ్ చేతులమీదుగా విడుదల అయ్యింది. 'ప్రాణనిధి' - ఈ విపత్కర పరిస్థితికి రక్షణ మార్గం అనే ఉప శీర్షికతో తయారయి రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు కు ఎంపికైన ఈ చిత్రం లో సీనియర్ నటులు శ్రీ ఏ ఎం ప్రసాద్ , హీరో మరియు నిర్మాత ఆదిత్య భూషణ్ సహజ నటనతో హృద్యంగా ఆవిష్కారించారు. ఈ సందర్భంగా దర్శకుడు మణి భూషణ్ మాట్లాడుతూ చిన్న చిత్రమైన పెద్ద సందేశం ఇస్తుందని. మరో మంచి చిత్రం మీకు అందించే ప్రయత్నం సఫలీకృతం అయ్యిందని, కరోనా ఉజ్రంభిస్తున్న ఈ సమయం లో ఇలాంటి సామజిక చైతన్యం కలిగించే చిత్రం అందించడం, ప్రజల్లో ఒక ధైర్యం నింపే ప్రయత్నం అందరి మన్నలను పొందుతుందని, ఎడిటర్ నీరజ భూషణ్ అసమాన ఎడిటింగ్ ద్వారా ముడునిమిషాల్లో ఒక మంచి చిత్రం చూసే అనుభూతుని కలగజేశారని, నటించిన హీరో ఆదిత్యభూషణ్ కు, సీనియర్ నటులు ఏ ఎం ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. టీవీ టూరిజం యూట్యూబ్ ఛానల్ ద్వార ఈ చిత్రాన్ని ప్రేక్షకులు చూడవచ్చని.





సమాజ చైతన్యం కోసం టీవీటూరిజం అప్ ను విడుదల చేశామని ఉచిత మొబైల్ అప్ కొరకు 9848418582 కు వాట్సాప్ ద్వారా మెసేజ్ చెయ్యవచ్చని దర్శకుడు మణి భూషణ్ తెలిపారు. ఈ కార్యక్రమం లో సంస్థ సభ్యులు సీఈఓ సీత రామ స్వామి, ఎడిటర్ నీరజ, ఏ ఎం ప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

## కరోనా పట్ల అప్రమత్తంగా ఉండాలి

మాకవరపాలెం : మాకవరపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 26 కోవిడ్ కేసులు నమోదయినట్లు ఆరోగ్య కేంద్రం సిబ్బంది తెలిపారు.

కోవిడ్ నియంత్రణలో భాగంగా 45 సంవత్సరాలు దాటిన వారందరికీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం సచివాలయాల వారీగా స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తు న్నామన్నారు. ఎటువంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా తక్షణం సమీపంలోగల ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించాలని విజ్ఞప్తి చేశారు.

## నేడు సచివాలయం సిబ్బందికి రెండో విడత కోవిడ్ వ్యాక్సిన్

### పరవాడ ఎమ్పిడిఒ హేమసుందర్‌రావు

పరవాడ: నేడు రెండో విడత వ్యాక్సిన్ కు ఏర్పాట్లు పూర్తిచేసామనీ పరవాడ ఎమ్ పిడిఒ హేమసుందర్ రావు తెలిపారు. ఇటువలే మొదటిదశ కోవిడ్ వ్యాక్సిన్ వేసుకున్న సచివాలయం సిబ్బంది వాలెంటర్లీ అందరూ నేడు రెండో విడత వ్యాక్సిన్ వేస్తారు అని తెలియజేసారు.పరవాడ పిహెచ్ సి మరియు వాడచీపురుపల్లి పిహెచ్ సి అయా పరిదిలోగల సిబ్బందికి ఈ వ్యాక్సిన్ ను వేస్తారు అని తెలిపారు.

బుధవారము జాయింట్ కలెక్టర్ నిర్వహించిన టెలికాన్ఫెరేన్స్ లో ఈ నిర్ణయం తీసుకున్నారు అని అన్నారు. అంతేకాకుండా 60 సంవత్స రములు దాటీ మొదటి విడత కోవిడ్ వ్యాక్సిన్ వేయించు కున్న ప్రజలుకు కూడా రెండో విడత కోవిడ్ వ్యాక్సిన్ కు ఏర్పాట్లు పూర్తిచేసామనీ ఎమ్ పిడిఒ హేమ సుందర్ రావు తెలిపారు. ఈ అవ కాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగము చేసుకోవాలి అని కోరారు.




# వడదెబ్బకు 'ఉల్లి' వైద్యం



వడదెబ్బనుంచి ఉపశమనం కలిగించడంలో ఉల్లి చాలా ఉత్తమమైనదని ఆయుర్వేదం చాలా స్పష్టంగా పేర్కొంది. ఉల్లిరసాన్ని చెవుల వెనుక భాగాన, ఛాతీ పైన పెడితే శరీర ఉష్ణోగ్రత చాలా వరకు తగ్గుతుంది. ఉల్లిపాయలను దోరగా వేయించి జీలకర్ర, తేనె కలిపి కడుపులో తీసుకుంటే ఎంతో ఉపశమనం లభిస్తుంది. చట్నీలల్లో, సలాడ్స్‌లలో ఉల్లిపాయలు వేసి తీసుకున్నా, మీ శరీర వ్యవస్థ అంతా చల్లబడుతుంది. చింతపండులో విటమిన్లు, లవణాలు, ఎలక్ట్రలైట్స్ సమృద్ధిగా ఉంటాయి. చింతపండును నీళ్లల్లో ఉండికించి ఆ రసంలో కొంచెంగా చక్కెర వేసి తీసుకోవచ్చు. ఈ రసం శరీర ఉష్ణోగ్రత్తను తగ్గిస్తుంది. ఈ రసం లక్జేటివ్‌గా కూడా పనికిరావడంతో పాటు ఉదర వ్యవస్థలోని ఇబ్బందులను కూడా ఇది తొలగిస్తుంది. మామిడి రసం శరీరానికి రెట్టింపు శక్తినివ్వగల టానిక్. పచ్చి మామిడిపండ్ల రసాన్ని తీసుకుంటే, అందులో అతి స్వల్పంగా పచ్చిమిరపకాయలు కూడా వేస్తే, అది మన శరీరాన్ని చల్లబరుస్తుంది. అయితే ఈ ఉసాన్ని రోజుకు రెండు మూడు సార్లయినా తీసుకోవాలి. అయితే ఈ రసంలో జీలకర్ర, సోంపు, మిర్యాలు, నల్లఉప్పును కూడా స్వల్పంగా కలిపితే శక్తిని ఇవ్వడమే కాదు, ఎలక్ట్రలైట్స్ నిలువల్ని పెంచుతాయి. ఆలూ బుకార్ పండ్లల్లో శరీరాన్ని తేమతో ఉంచే యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీర అంతర్భాగాల్లో ఏర్పడే వాపును తగ్గిస్తాయి. ఆలు బుకార్ పండ్లను నీళ్లల్లో నానవేసి బాగా మెత్తపడ్డాక వాటిని పిసికి వాటితో ఒక ద్రావణం చేయాలి. ఇది వడదెబ్బనుంచి ఉపశమనం కలిగిస్తుంది. ధనియాల రసం, పూదీన రసం కూడా వడదెబ్బ బాధలనుంచి విముక్తి క లిగిస్తాయి. తులసి గింజలు, సోంపుగింజల్ని నీళ్లల్లో నానవేసి అందులో కొంచెంగా రోజ్ వాటర్ కలిపి తీసుకుంటే మరీ మంచిది. ఆపిల్ సైడర్ వెనెగర్‌ను కూడా చల్లని నీటిలో కలిపి అందులో కాసింత తేనె కలిపి తీసుకోవచ్చు.

## శిశువులకు అన్నం వద్దు



వాషింగ్టన్: ఏడాదిలోపు వయసున్న శిశువులకు అన్నం పెట్టడం మంచిది కాదని అమెరికా శాస్త్రజ్ఞులంటున్నారు. అన్నం తినే పిల్లల మూత్రంలో ఆర్సెనిక్ గాఢత ఎక్కువగా ఉన్నట్లు వారు కనుగొన్నారు. గర్భంలో ఉన్న పిండంపై, శిశువు జన్మించాక తొలినాళ్లలో కూడా రోగనిరోధక శక్తి, నరాల అభివృద్ధిపై ఆర్సెనిక్ వ్యతిరేక ప్రభావం చూపుతుందని గత పరిశోధనలు తేల్చాయి. పాలిష్ పట్టిన బియ్యంలో ఆర్సెనిక్ గాఢత, శిశువులకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన 200 నానోగ్రామ్/గ్రామ్ కన్నా ఎక్కువ ఉంటుంది. ఒక ఏడాది వరకు వయసున్న పిల్లలు తినే అన్నం, మూత్రంలో ఆర్సెనిక్ గాఢతల మధ్య సంబంధాన్ని డార్ట్‌మౌత్ కళాశాల పరిశోధకులు పరిశీలించారు.

2011-2014 దాకా న్యూహాంప్‌షైర్‌లో జన్మించిన 759 మంది శిశువులపై అధ్యయనం చేశారు.

## 'అలా అయితే మా పార్టీలోకి రావొద్దు'

పణజి: కాంగ్రెస్, బీజేపీ భార్యాభర్తల్లా వ్యవహరిస్తూ ప్రజలతో ఆడుకుంటున్నాయని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. మిస్టర్-మిసెస్ గా కాంగ్రెస్-బీజేపీ వ్యవహరిస్తున్నాయని ఆక్షేపించారు. పణజిలో ఆమ్ ఆద్మీ పార్టీ వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'కాంగ్రెస్-బీజేపీ పార్లమెంట్ లోపల మొగుడు-పెళ్లాం మాదిరిగా కొట్టుకుంటున్నాయి. ఈ రెండు పార్టీలకు ఒకరి రహస్యాలు మరొకరికి తెలుసు. గోవాలో కాంగ్రెస్ నేతల అక్రమాలకు సంబంధించిన ఫైళ్లు రక్షణ మంత్రి (మనోహర్ పరీకర్) వద్ద ఉన్నాయని కొంతమంది నాకు చెప్పారు. కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా ఆయన ఎటువంటి చర్యలు తీసుకోరు. వారిని బెదిరించేందుకు ఈ పత్రాలు ఆయన వద్దే ఉంచుకున్నార'ని కేజ్రీవాల్ పేర్కొన్నారు. రెండు పార్టీల మధ్య సంబంధాలు ఉన్నాయని, ప్రజలను వెర్రివాళ్లను చేసి ఆడుకుంటున్నాయని అన్నారు. కాంగ్రెస్-బీజేపీ ప్రజలను దోచుకుంటున్నాయని మండిపడ్డారు. దేశాన్ని చెరో ఐదేళ్లు పాలించాలని ఈ రెండు పార్టీలు అలిఖిత అవగాహనకు వచ్చాయని ఆరోపించారు. టిక్కెట్ల కోసం 'ఆప్'లో చేరవద్దని కేజ్రీవాల్ స్పష్టం చేశారు.

పార్టీలో పనిచేసే వారికి వివిధ బాధ్యతలు అప్పగిస్తామని, టిక్కెట్ల కేటాయింపు కూడా అలాంటిదేనని చెప్పారు. గోవా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ గెలిస్తే స్థానికుడినే ముఖ్యమంత్రిని చేస్తామని ఆయన ప్రకటించారు. వచ్చే ఏడాది జరగనున్న గోవా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తామని కేజ్రీవాల్ ఇంతకుముందే ప్రకటించారు.




## హెల్తీ ఫుడ్



***కార్యేషు దాసి, కరనేషు మంత్రి, భోజ్యేషు మాత, షయనేషు రంభ అని స్త్రీని పురాణాలు పొగిడాయి. అంతేకాక సహనం అంటే ఏమిటి అని ప్రశ్నించినప్పుడు కనిపించే నిలువెత్తు నిదర్శనం స్త్రీ. కాని ఇన్ని పనులు, ఇన్ని బాధ్యతలూ ఒంటి చేతితో చేసే స్త్రీ పోషకాహార లోపానికి గురవుతోంది. ఇటీవల అధ్యయనాలు ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఓ వైపు సామాజికంగా అసమానతలకు గురయ్యే మహిళలు పోషకాహార విషయంలోనూ వివక్షకు గురవుతున్నారు. సామాన్య, మధ్యతరగతి కుటుంబాలలో నెలకొనే సామాజిక జీవన ప్రమాణాలే ఇందుకు నిదర్శనం. చాలామంది మహిళలు పోషకాహార లేమితో బాధపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాలలో పిల్లల్లో ఎదుగుదల లోపం, మహిళలు పోషకాహారలేమితో బాధపడుతన్నట్లు, ఈ సమస్య ముఖ్యంగా ఆసియా దేశాల్లో అధికంగా కనిపిస్తున్నట్లు ఇటీవల ఓ సర్వేలో వెల్లడైంది. గ్రామీణ ప్రాంత ఉమ్మడి కుటుంబాలలో మగపిల్లలు, ఆడపిల్లల ఎదుగుదలలో తీవ్రమైన వ్యత్యాసం ఉన్నట్లు, పోషకాహారం అందించే విషయంలో ఆడపిల్లల పట్ల వివక్ష కొనసాగుతున్నట్లు అధ్యయనంలో వెల్లడైంది.***

ఇళ్లలో ముందుగా మగపిల్లలకు భోజనం పెట్టిన తరువాతే ఆడపిల్లలకు పెట్టే సంప్రదాయం ఇప్పటికీ కొనసాగుతోంది. ఫలితంగా మన దేశంలో మహిళలు, బాలికలు పోషకాహార లేమితో బాధపడుతున్నట్లు వెల్లడైంది. వేళకు తినకపోవటం వల్ల, సరైన పోషకాలు అందక వీరు పలు రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఎత్తు, బరువు తదితర విషయాల్లో సమతుల్యత లోపిస్తున్నట్లు కొలం బియా యూనివర్శిటీ ఆర్థిక శాస్త్రవేత్త అరవింద్ పన్‌గారియా అంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అత్తారింటికి వచ్చే కొత్తకోడళ్లు, వారి పిల్లలు పొట్టిగా ఉన్నట్లు సర్వేలో వెల్లడైంది. ప్రపంచం మొత్తమీద రక్తహీనతతో బాధపడే మహిళలు మనదేశంలోనే అధికంగా ఉన్నట్లు తాజా అధ్యయనంలో వెల్లడైంది. గ్రామీణ ప్రాంత మహిళలు, బాలికల్లో 60 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు వెల్లడైంది.

రక్తంలో ఇనుము తదితరాల కోసం ఐరన్ మాత్రలు తీసు కునే బదులు ఇనుము ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవడమే మంచిది. కానీ, ఇలాంటి నాణ్యమైన పోషకాహా రమే వారికి లభించడం లేదు.

ప్రభుత్వాలు ఆహారభద్రత చట్టం లాంటివి ఎన్ని తెచ్చినా ప్రయోజనం అంతంత మాత్రమే. పోషకాలు ఉండే ఆహార పదార్థాలన్నీ కాస్త ఖరీదు ఎక్కువగానే ఉంటున్నాయి. అందుకే ధర తక్కువగా ఉండే చిరుధాన్యాలు తదితర ఆహార పదార్థా లను తీసుకుంటే ఎంతో మంచిది.

సుమారు యాభై ఏళ్ల క్రితం గ్రామీణ ప్రాంతాలలో సామా న్య, మధ్యతరగతి కుటుంబాలలో చిన్నా, పెద్ద మొదలు అంద రూ జొన్న,సజ్జలు,రాగులు లాంటి తృణధాన్యాలను ఆహారం గా తీసుకునేవారు. వీరు కఠినమైన పనులు అధికంగా చేసే వారు కాబట్టి ధృడంగా, ఆరోగ్యంగా ఉండేవారు. రానురానూ జీవనశైలిలో వచ్చిన మార్పులతో పాటు ఆర్థికలేమి వారిని చౌకగా లభించే పోషకాహారం నుంచి దూరం చేస్తోంది. ఒకే కు టుంబంలో ఉండే ఆడ, మగపిల్లల శారీరక ఎదుగుదలను గనుక పరిశీలిస్తే ఎంతోవ్యత్యాసం కనిపిస్తోంది. కనీసం గంట సేపు కూడా పరుగెత్తలేని పరిస్థితిలో గ్రామీణ ప్రాంత పిల్లలు ఉన్నారు. ఎత్తు, లావు, చురుకుదనం తదితర విషయాల్లో విప రీతమైన తేడా ఉంటోంది. అలాగే, పిల్లల్లో శారీరక సామర్థ్యం కూడా చాలా తక్కువ ఉన్నట్లు వెల్లడైంది. టీవీలకు, ఇంటర్నెట్ గేమ్స్‌కు అతుక్కుపోతూ చిన్నారులు నిర్లక్ష్యం చేస్తున్నారు.క్రీడ లతో శారీరక,మానసికఎదుగుదల ఎక్కువగాఉంటుంది. చిన్న తనంలో ఆటలవల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి. ఆటల వల్ల నాడీ వ్యవస్థ ఉత్తేజితమవుతుంది. ఫలితంగా పిల్లల్లో ఎదుగు దల ఉంటుంది. కానీ,దురదృష్టవశాత్తూ పేదరికం పిల్లలకు పెను శాపంగా మారి వారి ఎదుగుదలను కుంగదీస్తోంది. వాస్త వానికి మగపిల్లల్లో ఎదుగుదల జీవితంలో మూడుసార్లు జరు గుతుంది.ఆ సమయంలో సరైన పోషకాహారం తీసుకుంటే వా రుఎత్తుపెరుగు తారనిప్రిన్స్‌యూనివర్శిటీ ప్రొఫెసర్‌అంగ్స్ డీట న్‌అంటు న్నారు. సరైనపోషకా హారంతీసుకోకపోతేఎన్నో పెరుగు దలలోపాలు ఏర్పడిరానురానూ మరిన్నిఇబ్బందులుతలెత్తే పరి స్తితిఉంది. కాబట్టిసరైన పోషకాహారంతీసుకోవట ం మంచిది.


కాకర, పండ్లు , కాయగూరలు, గింజలు, పప్పులు, కంద మూలాలు, సుగంధద్రవ్యాలు మానవుడికి ప్రకృతి ప్రసాదిం చిన అపురూపమైన వరము .ఆయా సీజన్లలో పండే పండ్లను ఆరగించడం మనకు తరతరాలుగా తెలుసు. అన్నంతో కూడా ప్రకృతిసిద్ధమైన పండ్లు, కూరగాయలు ఇతర త్రునధన్యాలను ఆహారంగా ఆహారముగా తీసుకుని జీవించినట్లయితే శరీరాని కి కావససినఅ న్నిరకాలపోషకాలు లభిస్తాయి. ఇదేఅసలు ఉత్త మమైన జీవన విధానమని పకృతి వైద్యుల నమ్మకం. కాకర ఇండియా అంతా పెంచబడుతున్న ఓ చేదు తీగ జాతి మొక్క. దీని శాస్త్రీయ నామం మొమోర్డికా కరన్షియా. ఇది కుకుర్బిటేసి కుటుంబానికి చెందినది. ఆరోగ్యాన్ని ఇచ్చే కాకర చేదు అయి నప్పటికీమధుమేహానికి మందుగావాడుతున్నారు.కాయ, కాక ర రసం,కాకరఆకులు మందుగా ఉపయోగపడతాయి. కాకర రసంలో హైపోగ్లసమిక్ పదార్థము ఇన్‌సులిన్ స్థాయిలో తేడా రాకుండా నియంత్రణ చేస్తూ రక్తంలోని చెక్కెర స్థాయిని అదు పులో ఉంచుతుంది. కాకర గింజలల లో రక్తంలో గ్లూకోజ్‌ను తగ్గించే చారన్‌టిన్‌అనే ఇన్సులిన్ వంటి పదార్థం ఉంటుంది . తమిళము: పావక్కాయ్, కన్నడము: హాగల్ కాయి, మళ యాలము: కప్పాక్కా, ఓండ్రము: కరవిలా, హిందీ: కర్లీ, కరేలా, సంస్కృతము: కారవేల్ల. కాకర రకాలు నల్ల కాకర, తెల్ల కాకర, బారామాసి, పొట్టికాకర, బోడ కాకర కాయ అని మరొక గుండ్రని కాయ. ఇది కూడా చేదుగానే ఉంటుంది. కాకరకాయలు కొంచెం చేదుగా ఉన్నను ఉడికించినా, పులుసును పెట్టినా, బెల్లమును పెట్టి కూరగా చేసినా మంచి రుచికరంగా ఉంటుంది. కొద్దిగా చేదు భరించువారు దీనిని ముక్కలుగా చేసి తినుడం చేయవచ్చు. దీనిలో నీరు తక్కువ పౌష్టిక శక్తి ఎక్కువ.

### వైద్యమున ఉపయోగాలు:

దీనిని తింటే కొంతమందికి వేడి చేస్తుంది. అటువంటి వారికి దీనిని మజ్జిగలో ఉడికించి ఇవ్వా లి. తద్వారాచేదు కూడాతగ్గుతుంది. కాకరాకురసమును కుక్క, నక్క మొదలగు వాటి కాటునకు విరుగుడుగా వాడతారు. కొం దరు ఈ ఆకు రసమును గాయాలపై రాస్తారు. మరికొందరు దీనిని చర్మ వ్యాధులకు, క్రిమిరోగాలకూ వాడతారు. కాకర కా య అనగానే ఒక్క మధుమేహ వ్యాధిగ్రస్తులకే మంచి ది అను కోకండి. ఔషధగుణాలున్న కాకరనుతరచూ తీసుకోవడం వల్ల రక్త శుద్ధి జరుగుతుంది. హైపర్‌టెన్షన్‌ని అదుపులో ఉంచుతుది. ఫాస్ఫరస్, అధిక మొత్తంలో పీచు లభిస్తుంది. సోరియాసి స్‌ను నివారణలో కాకరకీలకపాత్రపోషిస్తుంది. శరీరానికి అత్యా వ శ్యక పోషకాలెన ఫొలేట్, మెగ్నీషియం, పొటాషియం, జింక్ కూడా సమృద్ధిగా లభిస్తాయి. జీర్ణ శక్తిని వృద్ధి చేస్తుంది.

చేదు గా ఉన్నందున పొట్టపురుగు నివారణకు ఉపయోగపడును. దీనిలో ఉన్న మోమొకార్డిసిన్ యాంటి వె%రస్‌గా ఉపయోగప డుతుంది. ఇమ్యునో మోడ్యులేటర్‌గా పనిచేయడం వల్ల కాన్స ర్, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మంచిది.

# ఈ అవగాహన అత్యవసరమే..!



మీరు మిత్రుడితో కలిసి మాట్లాడుకుంటూ రోడ్డుమీద నడుస్తున్నారు. అకస్మాత్తుగా అతడు స్పృహ తప్పాడు... ఏం చెయ్యాలి? ఇంట్లో ఒక్కసారిగా తాతయ్య మాటల్లో తడబాటు కనిపించింది... ఎందుకని? ఆ మార్పు ప్రమాదకరమా? రోడ్డు మీద వెళు తున్నపుడు అకస్మాత్తుగా ఒకరు ఫిట్స్‌తో పడిపోయారు... మనం ఏదైనా సాయం చెయ్యగలమా? ఎప్పుడూ లేనిది కడుపు పై భాగంలో నొప్పి అసిడిటి కావచ్చని అనుకుంటాము... అది నిజంగా అసిడిటినే అయి ఉంటుందా..? లేక మరేదైనా ప్రమాదకరక స్థితి కాదు కదా? ఇలాంటి వన్నీ ఒక్కోసారి అత్యవసర పరిస్థితులకు దారి తియ్యవచ్చు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులను గుర్తించడం.., సమయానికి స్పందించడం... గురించిన వివరాలు అత్యవసర పరిస్థితి చెప్పి రాదు; అది ఎప్పుడైనా ఎదురు కావచ్చు. ఎదుర్కోవాల్సిన పరిస్థితులు ఎవరికైనా ఏర్పడనూ వచ్చు. అలాంటి స్థితిని ఎదుర్కోవడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉండాలి. అది మనతో ఉన్న వారు అకస్మాత్తుగా స్పృహ తప్పటం, ఎవరికైనా షాక్ కొట్టడం, ఎవరైనా పై నుంచి కింద పడిపోవడం, ఎప్పుడూ లేని విధంగా కడుపులో నొప్పి రావడం, ఇంట్లో ఎవరికైనా స్ట్రోక్ రావడం, రోడ్డు మీద ఎవరికైనా ఫిట్స్ రావడం ఇలా అత్యవసర స్థితి ఎప్పుడైనా ఏరూపంలోనైనా ఎదురు కావచ్చు. అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు ఎలా స్పందించాలనే విషయాల గురించి తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి.

### స్పృహ తప్పితే...

అనుకోకుండా మన వెంట ఉన్న వారు స్పృహ తప్పి పడిపోతే ముందుగా మనకు చాలా కంగారు కలుగుతుంది. ఏం చెయ్యాలో తోచదు. అయ్యో...అయ్యో... అనడం మినహా వెంటనే కర్తవ్యం బోధపడదు. అయితే స్పృహ తప్పిన వారిని ప్రమాదం నుంచి బయట పడెయ్యాలంటే అన్నింటికంటే ముందుగా మనం అలా కంగారు పడకుండా ఉండడం అవసరం. ఒకవేళ కంగారు పడినా వెంటనే సర్దుకోవాలి. పడిపోయిన వారిని గట్టిగా కుదిపి లేపి చూడాలి. గట్టిగా వారి పేరు పెట్టి పిలవాలి. ఒకవేళ వారు స్పందించగలిగితే అది ఒకింత మేలైన స్థితిగా భావించవచ్చు. ఎలాంటి స్పందన లేకపోయినట్టయితే సాయం కోసం ఎవరినైనా అభ్యర్థించడం మంచిది.

గొంతు కింద చెయ్యి పెట్టి అక్కడ కొట్టుకునే నాడిని పరీక్షించి చూడాలి. ఇక్కడ కొట్టుకునే నాడిని కెరొటెడ్ పల్స్ అంటారు. అక్కడి నాడీ స్పందన కనిపించకపోతే వెంటనే కార్డియోపల్మనరీ రీ సజిటేషన్(సీపీఆర్) అనే ప్రథమ చికిత్స చెయ్యాలి. ఇందులో భాగంగా ఒకచేతి మీద మరో చేతిని ఉంచి బాధితుడి ఛాతి మధ్య భాగంలో బలంగా ఒత్తిడి కలిగించాలి. ఈ ఒత్తిడి ఎంత బలంగా ఉండాలంటే లోపలికి ఛాతిని ఒత్తినపుడు అది దాదాపు రెండు అంగుళాల మేర లోపలికి వెళ్లాలి. అలా 30 సార్లు ఒత్తిడి కలిగించిన తర్వాత బాధితుడి ముక్కు మూసేసి నోటిని నోటితో మూసేసి బలంగా రెండు సార్లు ఊపిరి తిత్తులలలోకి గాలి ఊదాలి. ఇలా వంద సార్ల వరకు ఒత్తిడి కలిగించాలి. గాలి ఊదాలి. ఇది 30:2 నిష్పత్తిలో ఉండాలి. అంటే 30 సార్లు ఒత్తిడి కలిగించి 2 సార్లు గాలి ఊదాలి. ఇలా 5 నిమిషాలు చేసి తిరిగి సీపీఆర్ కొనసాగించాలి. నాడి తిరిగి కొట్టుకోవడం మొదలు పెట్టే వరకు ఈ చికిత్స కొనసాగించాలి.

ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫ్యూజర్ ఉపయోగిం చవచ్చు. ఇది ఆ సమయంలో షాక్ అవసరమా కాదా అనేది కూడా నిర్ణయిస్తుంది. దీనిలో మూడు బటన్స్ ఉంటాయి. మొదటిది ప్యాడ్స్‌ను బాధితులకు అమర్చడానికి, రెండోది హృదయస్పందనను విశ్లేషించడానికి, మూడోది షాక్ అవసరమా కాదా నిర్ణయించడానికి ఉపయోగపడతాయి. దీనిని ఎవరైనా ఉపయోగించవచ్చు. నిజానికి ఇది అన్ని పబ్లిక్ ప్లేస్‌లలో అందుబాటులో ఉండాలి. **మూర్ఛ** మూర్ఛతో బాధపడేవారిని చూసినపుడు చాలా భయం కలుగుతుంది. ఎలా స్పందించాలో కూడా అర్థం కాదు. అందరూ ఒకరకమైన ఆందోళనతో చుట్టూ చేరతారు. కొంత మంది కాస్త ధైర్యం చేసి వారి చేతికి ఏ ఇనుప వస్తువునో, తాళం చేతుల గుత్తినో అందించేందుకు ప్రయత్నం చేస్తారు. అయితే దీనితో పెద్దగా ప్రయోజనం లేదనేది నిపుణుల మాట. ఎవరికైనా మూర్ఛ వచ్చినపుడు కొన్ని ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించడం వల్ల రోగికి కొంత ఉపశమనం కలిగించిన వారిమవుతాము.

-మూర్ఛ వచ్చిన వారి చుట్టూ గుంపు కట్ట కూడదు.

-వారిని ఒడిసి పట్టుకునే ప్రయత్నం కూడా చెయ్యొద్దు, దగ్గరలో ఏవైనా గాయపరిచే వస్తువులు ఉంటే వాటిని దూరంగా తీసేస్తే చాలు

-మూర్ఛ నుంచి బయటపడిన వెంటనే తినడానికి ఏమీ ఇవ్వ కూడదు -ఒక వైపుగా తిప్పి పడుకోబెట్టడం వల్ల మూర్ఛ సమయంలో వారి నోట్లోకి వచ్చిన లాలాజలం వంటి స్రావాలు ఊపిరితిత్తుల్లో చేరకుండా నివారించవచ్చు. అది ఎడమ వైపు తిప్పి పడుకోబెడితే మరీ మంచిది.

## మొఖం మీద సన్నని వెంట్రుకలను తొలగించే ఎగ్ వైట్

*చర్మ సంరక్షణ కోసం ఇంట్లో తీసుకొనే జాగ్రత్తలతో చాలా ప్రయోజనాలున్నాయి. సాధారణంగా తీసుకొనే ఆహార పానీయాలు ఆరోగ్యంగా ఉండేందుకు, చర్మ సంరక్షణకు సహకరిస్తుంది. ముఖంలో మొటిమలు రాకుండా కాపాడుతుంది. అయితే చర్మ సంరక్షణకు ఒక్క ఆహార పానీయాలతోటే సరిపోదు. ఆహార పానీయాలతోపాటు మరి కొన్ని ఇంటి చిట్కాలను కూడా పాటించినట్లైతే చర్మాన్ని మరింత మెరుగుపరచుకొని ఎప్పుడూ ఫ్రెష్‌గా కనపడ వచ్చు. అలాగే ముఖచర్మం కాంతివంతంగా కనబడే సమ యంలో ఏదో ఒక చిన్న లోపం తెలుస్తూనే ఉంటుంది. మొటిమలు లేకపోయినా దానికి సంబంధించిన నల్లమ చ్చలు, ముఖ చర్మం నల్లగా ఉండటం, లేదా ముఖం తెల్లగా ఉన్నా ముఖం మీద సన్నని వెంట్రుకలు కనిపిస్తూ అంద విహీనంగా కనబడుతుంటాయి. మరి ఈ చిన్న చిన్న లోపాలను ఎలా సరిదిద్దుకోవాలో ముఖాన్ని ఎలా సున్నితంగా ఉండేట్లు చేయాలో చూద్దాం. ముఖం సున్నితంగా.. కాంతివంతంగా, చర్మాన్ని బిగుతుగా ఉంచేందుకు గుడ్డు బాగా పనిచేస్తుంది. ఒక్కసారి గుడ్డును చర్మ సంరక్షణలో ఉపయోగించి, ఫలితమేంటో చూడండి. మరి గుడ్డును ఏవిధంగా ఉపయోగించాలో చూద్దాం. గుడ్డు తెల్లని సొనలో న్యూట్రియట్స్ అధికంగా కలిగి ఉండడంవల్ల చర్మం మెరుస్తుండేలా చేస్తుంది. గుడ్డుతో ఫేస్ ప్యాక్ ఎలా? ఒక మిక్సింగ్ బౌల్ తీసుకుని అందులో గుడ్డులోని తెల్లసొన ఒక చెంచా, ఆలివ్ ఆయిల్ ఒక చెంచా, నిమ్మ రసం ఒక చెంచా వేసి బాగా మిక్స్‌చేసి ముఖానికి, గడ్డం క్రింద, మొత్తం మెడ మీద అప్లై చేయాలి. అరగంట పాటు అలాగే వదిలేస్తే చర్మం బిగుసుకుంటుంది. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. అంతే చర్మం తాజాగా ఉండటమే కాక, బిగుతుగా ఫ్రెష్‌గా కనబడు తుంది. ఈ ఫేస్ ప్యాక్ సాధారణ చర్మతత్వం కలవారి నుండి పొడి చర్మం వారికి కూడా అద్భుతంగా పనిచేస్తుంది. గుడ్డు సొనతో మరో అద్భుతమైన మార్పును తీసుకొచ్చే స్వభావం కలిగి ఉంది. అందమైన ముఖంలో చెవుల దగ్గర, చెంపలమీద, చిన్న గడ్డం మీద కంటికి కనిపించి, కనిపించని వెంట్రుకలు ఉంటాయి. అటువంటి వాటిని పూర్తిగా తొలగిస్తుంది. అందుకోసం ఒక మిక్సింగ్ బౌల్‌లో గుడ్డులోని తెల్లని సొన తీసుకొని,*

*ఒక చెంచా పంచదార, అర చెంచా మొక్కజొన్న పిండి కలిపి బాగా మిక్స్ చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖంలో ఎక్కడెక్కడ సన్న వెంట్రుకలు ఉన్నాయో ఆ ప్రదేశంలో అప్లై చేసి అరగంట తర్వాత స్క్రబ్ చేసి తొలగించి ముఖాన్ని శుభ్రపరచుకుంటే అద్భుతమైన మార్పు కనిపిస్తుంది. దాంతో పాటు ముఖం సున్నితంగా, మృదువుగా కనిపిస్తుంది. ముఖం ప్రకాశవంతంగా కనబడేం దుకు ఇది ఒక ఎవర్ గ్రీన్ బ్యూటీ టిప్.*

# కోవిడ్ వ్యాక్సిన్ 2వ డోస్ ప్రత్యేక డ్రైవ్

## - జివిఎంసి కమిషనర్ డా.జి.సృజన



విశాఖపట్నం : కోవిడ్ వ్యాక్సిన్ 2వడోస్ తీసుకోవాల్సిన వారి కొరకు గురువారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించబడుతుంది అని జివిఎంసి కమిషనర్ డా. జి. సృజన తెలిపారు. మొదటి డోసు వేయించుకొని ఈనెల 24 నాటికి అర్హులైన ఫ్రంట్లైన్ వారియర్స్, ఆరోగ్య సిబ్బందికి, సాధారణ ప్రజలకు గురువారం రెండవ డోసు వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. కోవిషీల్డ్ వ్యాక్సిన్ నగరంలో కెజిహెచ్, ఛాతి ఆసుపత్రి, మానసిక వైద్యశాల, గోస ఆసుపత్రి, జివిఎంసి పరిధిలోని ప్రాధమిక ఆరోగ్య కేంద్రంలో మరియు ఎఫ్.ఆర్.యు.ఆరిలోవ ఆసుపత్రి, ఎఫ్.ఆర్.యు. మల్కాపురం ఆసుపత్రిలలో వేస్తారని, కోవాక్సిన్ ప్రాంతాలలో కంటి ఆసుపత్రి, జివిఎంసి ఆసుపత్రి, కెజిహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాకులో, స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియం లో, అనకాపల్లి అర్బన్ ఫ్యామిలీ వెల్ఫేర్ సెంటర్ లలో వేస్తారన్నారు. మొదటి డోస్ వ్యాక్సిన్ వేయించుకోదలచిన వారికి రెండు, మూడు రోజులలో తేది తెలియపరుస్తామని కమిషనర్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేసారు.

# ఏపీలో పరీక్షలు వాయిదా వేయాలి



అమరావతి: ఏపీలో కొవిడ్ విజృంభిస్తున్న నేపథ్యంలో పదో తరగతి, ఇంటర్ పరీక్షలను రద్దు చేయాలని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు సీఎం జగన్‌కు లేఖ రాశారు. రాష్ట్రంలో కరోనా కేసులు పెరుగుతున్నా షెడ్యూల్ ప్రకారమే పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. విద్యార్థులు పరీక్షలకు ప్రజా రవాణా ద్వారానే రావాల్సి ఉంటుందని వివరించారు. దీని వల్ల కరోనా మరింతగా వ్యాప్తి చెందుతుందని చెప్పారు. అందువల్ల పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నానన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో కొవిడ్ వ్యాధిగ్రస్తుల చికిత్స, ఛార్జీలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని సోము వీర్రాజు లేఖలో పేర్కొన్నారు. కొందరు లక్షలు ఖర్చు చేసినా ప్రాణాలు నిలుపులేకపోతున్నారని.. రోగులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సోము వీర్రాజు అన్నారు. కొవిడ్ వ్యాధి నియంత్రణకు అవసరమైన మందులు, ఆక్సిజన్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాన్నారు. ఆక్సిజన్ ఉత్పత్తి కేంద్రాలను విశాఖతో పాటు విజయవాడ, రాయలసీమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని లేఖలో సోము కోరారు.

# యశోద ఆస్పత్రికి సీఎం కేసీఆర్



హైదరాబాద్: తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ నెల 19న సీఎం కేసీఆర్‌కు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సీటీ స్కాన్, ఇతర పరీక్షల కోసం సీఎం యశోద ఆస్పత్రికి వచ్చారు. అంతకుముందు ఆయనకు వ్యవసాయ క్షేత్రంలోనే కొన్ని ప్రాథమిక పరీక్షలు నిర్వహించారు. అయితే వైరస్ తీవ్రతను తెలుసుకునేందుకు సీటీ స్కాన్ సహా ఇతర పరీక్షలు నిర్వహించాలని వైద్యులు సూచించిన నేపథ్యంలో ఆయన యశోద ఆస్పత్రికి వచ్చారు. ప్రభుత్వ, పార్టీ వర్గాల సమాచారం మేరకు సీఎం కేసీఆర్ ఆరోగ్యం పూర్తి స్థాయిలో నిలకడగా ఉందని తెలుస్తోంది. వైరస్ లక్షణాలు సైతం సాధారణంగానే ఉన్నాయని సీఎం వ్యక్తిగత వైద్యుడు ఎంవీ రావు స్పష్టం చేశారు. ఈ నెల 19న యాంటీజెన్ పరీక్ష చేయించుకోగా సీఎంకు స్వల్పంగా కొవిడ్ లక్షణాలున్నట్లు తేలింది. ఆర్‌టీపీసీఆర్ పరీక్ష సైతం నిర్వహించగా.. అందులోనూ పాజిటివ్‌గా తేలింది. అప్పటినుంచి వైద్యుల సలహా మేరకు ఆయన వ్యవసాయ క్షేత్రంలోనే హోం ఐసొలేషన్‌లో ఉన్నారు.

## సింహగిరి శ్రీ సీతారామస్వామివారి ఆలయంలో

# వైభవంగా శ్రీరామనవమి వేడుకలు





సింహాచలం : శ్రీవరాహలక్ష్మీనృసింహస్వామివారి ఉప దేవా ఆలయాలు కాశీ విశ్వేశ్వర పంచాయతన

ఆలయం మరియుసింహగిరిపై గంగధార సమీపాన గల శ్రీసీతారామస్వామివారి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ సీతారామ కళ్యాణమహోత్సవం వైభవంగా జరిగింది .ఉత్సవంలో భాగంగా స్వామివారి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై ఆశీనులను గావించి.విశ్వక్షేణ ఆరాధన , పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం వేదమంత్రోచ్ఛరణల నడుమ యజ్ఞోప ధారణ గావించారు. బ్రహ్మముహూర్త వేళ మాంగళ్య ధారణ గావించారు . అనంతరం ముత్యాలు కలగలిపిన తలంబ్రాలు పోత కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు .కరోనా నేపథ్యంలో శ్రీ సీతారామ కళ్యాణమహోత్సవాన్ని భక్తులు లేకుండానే ఏకాంతంగా నిర్వహించారు .

# 25, 55 వార్డుల లో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న కె కె రాజు



సీతమ్మపేట : గ్రేటర్ విశాఖ 25 వ వార్డు సీతంపేట లో గల శ్రీ శ్రీ శ్రీ పార్వతీశ్వరాలయంలో సంపంగి సీను ఆధ్వర్యంలో జరిగిన శ్రీరామనవమి వేడుకలో విశాఖ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్త కె కె రాజు పాల్గొన్నారు. ముందుగా సీతారాముల వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో 25 వ వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందు,బి. గోవింద్, మరియు గ్రామ పెద్దలు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**55 వ వార్డు లో........ గ్రేటర్ విశాఖ**

55 వ వార్డు గవర తాటిచెట్లపాలెం లో శ్రీ హనుమాన్ సీతారామ పంచాయతన ఆలయం లో జరిగిన శ్రీరామనవమి వేడుకలు విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె కె రాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, గంగా మహేష్, చిన్న,కృపా మరియు ఆలయ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రామతీర్థం శ్రీరాముని కళ్యణోత్సవానికి సింహాచలం దేవస్థానం

# పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ



సింహాచలం: విజయనగరం జిల్లా రామతీర్థం లో వేంచేసి యున్న శ్రీ సీతారాచంద్రస్వామి వారికి శ్రీ రామనవమి కళ్యాణోత్సవానికి సింహాద్రి అప్పన్న తరుపున దేవస్థానము అధికారులు స్వామి అమ్మవార్ల కళ్యాణోత్సవానికి పట్టు వస్త్రాలు మరియు ముత్యాల తలంబ్రాలు బుధవారం నాడు సమర్పించారు ఈ కార్యక్రమానికి దేవస్థానం ఏ ఈఓ రాఘవ కుమార్ ప్రధాన అర్చకులు గోపాల కృష్ణమాచార్యులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.




*జోలాపుట్ నుండి ముంచింగిపుట్టు మీదుగా ముడి పసుపు బస్తాలు మాటున గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా పాడేరు పోలీసులు ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బందితో అంబేద్కర్ జంక్షన్, పాడేరు వద్ద వాహన తనిఖీలు నిర్వహించగా లారీలో సుమారు 1200 కేజీల గంజాయి లభ్యమయింది. దీని విలువ సుమారు 36 లక్షల రూపాయలు ఉంటుందని, ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు.*

# కరోనా వ్యాక్సిన్లను అక్రమంగా విక్రయిస్తున్న నలుగురి అరెస్టు..

## వివరాలు వెల్లడించిన ఏ సి పి హర్షిత..



విశాఖపట్నం : నగరంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి లో గల కోవిడ్ రోగుల కరోనా వ్యాక్సిన్లను అధిక ధరలకు విక్రయిస్తున్న నలుగురిని నగర పోలీసులు అరెస్టు చేశారు ఈ సందర్భంగా బుధవారం సాయంత్రం మూడో పట్టణ పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను ఏసీపీ హర్షిత తెలిపారు. స్థానిక రామనగర్ లోన ఒమని హాస్పిటల్ లో హౌస్ కీపింగ్ డిపార్ట్మెంట్ మేనేజర్ గా నాలం సర్వేశ్వర రావు పని చేస్తున్నారు. కోవిడ్ వలన గత నెల 31న చికిత్స నిమిత్తం ఒమని

హాస్పిటల్ లో జాయిన్ అయి ఈనెల 13న డిశ్చార్జి అయ్యారు . తనకు ట్రీట్మెంట్ నిమిత్తం ఇండెంట్ పెట్టిన మూడు వ్యాక్సిన్లను బయటన ఎక్కువ రేటు కి అమ్ముకునే నిమిత్తం తన యింటికి తీసుకెళ్ళి ఫ్రెండ్ సురేష్ కు ఒక్కకటి అధిక ధరకు అనగా 5,400/రూపాయలు కి అమ్మి డబ్బులు సంపాదించినటు ఏసీపీ తెలిపారు. అలాగే సర్వేశ్వరరావు దిగువ ఉద్యోగి అయిన ర

హౌస్ కీపింగ్ సూపర్వైజర్ వెంకట రావును ఫోన్ చేసి మరొక నాలుగు ఇంజెక్షన్లను ఏర్పాటు చేయవలిసిందిగా కోరాడు. ఒమని హాస్పిటల్ లోని కోవిడ్ వార్డ్ లో ఎవరు లేని సమయంలో రెన్ డిసవర్ ఇంజక్షన్లు దొంగలించి, స్టాఫ్ నర్స్ లు అయిన సింధుజు, దివ్య కృపలను పరిచయం చేసుకుని వారి నుండి మరో 2 రెన్ డిసవర్ ఇంజెక్షన్లను వెంకట్రావు తీసుకున్నారు ఇందులో మూడు ఇంజెక్షన్లను వాసు అనే అతనికి సర్వేశ్వరరావు ఒక్కకటి 7,000/- రూపాయలు చొప్పున అమ్మేసి

రూ .21,000/- లు డబ్బులు సంపాదించినటు ఏసీపీ వెల్లడించారు. ఈ విధంగా ఆరు ఇంజెక్షన్లను అధిక ధరకు వీరు విక్రయించినట్లు ఆమె పేర్కొన్నారు. వీరంతా ఒమని హాస్పిటల్ లో పనిచేస్తూ వారి యొక్క విధులను

సక్రమంగా నిర్వర్తించకుండా కరోనా రోగులకు ఉపయోగించాల్సిన ఇంజెక్షన్లను బయట బ్లాక్

లో అమ్మి వేస్తున్నారని ఆమె తెలిపారు. నిందితులు నాలం సర్వేశ్వర రావు, ఇనుపసప్పల వెంకటరావు, సందడి సింధు, గోరపతి దివ్యకృపలను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించామని తెలిపారు.

విధులు సక్రమంగా నిర్వర్తించకుండ ఇంజక్షన్లు పక్కదారి పట్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈలాంటి వ్యవహారాలన్ని ఇంటర్నల్ గా జరిగిపోతున్నాయని, డాక్టర్ మందుల చిటి లేకుండా ఇంజక్షన్లు అమ్ముతున్నట్లు అయితే మా దృష్టికి తీసుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు ఈ సమావేశంలో సీఐ కే ఈశ్వరరావు, ఎస్ఐ ధర్మేంద్ర పాల్గొన్నారు.

# మందుల కొరత లేకుండా చర్యలు



కర్నూల్: కొవిడ్ కష్టకాలంలో బాధితుల నుంచి ప్రైవేటు ఆస్పత్రులు అధిక మొత్తంలో వసూలు చేయడం సరికాదని ఏపీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కర్నూలు జిల్లాలో వైరస్ కట్టడిపై ఆయన జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. గత ఏడాది కొవిడ్‌ను సమర్థంగా నియంత్రించిన జిల్లాగా కర్నూలు నిలిచిందన్నారు. మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో అధిక ఛార్జీల నియంత్రణకు కమిటీ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడైనా అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు సమాచారం వస్తే ఈ కమిటీ వెంటనే స్పందించి సంబంధిత ఆస్పత్రిపై చర్యలు తీసుకుంటుందని వివరించారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com